

చిత్తూరు అర్బన్ తహసీల్దార్ కార్యాలయం వద్ద ధ్రువపత్రాల కోసం నిరీక్షిస్తున్న లబ్ధిదారులు

వైసీపీ పాలనలో సబ్సిడీ రుణాలకు దూరమైన వర్గాల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆశలు చిగురించాయి. రుణాలు లభిస్తే ఆర్థికంగా నిలదొక్కుకోవచ్చనే ఆశతో ఎదురుచూశారు. అనుకున్నట్లుగా బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలను ప్రభుత్వం మంజూరు చేసింది. అయితే రుణాలను తీసుకోవడానికి అవసరమైన కుల, ఆదాయ, నివేశ పత్రాలను మంజూరు చేయడంలో రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో లబ్ధిదారులు రెవెన్యూ, మీ- సేవ కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

సబ్సిడీ రుణాలకు రెవెన్యూశాఖ మోకాలడ్డు

- కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల జారీలో నిర్లక్ష్యం
- దరఖాస్తులకు నేటితో ముగియనున్న గడువు

చిత్తూరు అర్బన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని బీసీ కార్పొరేషన్ ద్వారా బ్రాహ్మణ, ఈబీసీ, కమ్మ, క్షత్రియ, రెడ్డి, వైశ్య, కాపు కార్పొరేషన్లకు కలిపి మొత్తం 2,797 యూనిట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ఒంటరి, తెలగ, మేదర కులస్తులకు కలిపి మరో 2,041 యూనిట్లను కేటాయించగా.. మంగళవారం నాటికి 12,650 మంది దరఖాస్తు చేసుకున్నారు. బ్రాహ్మణ కార్పొరేషన్‌లో 16 యూనిట్లకు 29 మంది, ఈబీసీలో 103 యూనిట్లకు 237మంది, కమ్మ కార్పొరేషన్‌లో 84యూనిట్లకు 258 మంది, క్షత్రియ కార్పొరేషన్‌లో 13యూనిట్లకు 37 మంది, రెడ్డి కార్పొరేషన్‌లో 75యూనిట్లకు 208 మంది, వైశ్య కార్పొరేషన్‌లో 16యూనిట్లకు 80మంది, కాపు కార్పొరేషన్‌లో 448 యూనిట్లకు 1,119 మంది దరఖాస్తు చేసుకున్నారు. మొత్తం 2,797 యూనిట్లకు మంగళవారం నాటికి 14,618 మంది దరఖాస్తు చేసుకున్నారు.

నాలుగు రోజుల కిందట కుల, ఆదాయ, నివేశ ధ్రువపత్రాల కోసం జిల్లావ్యాప్తంగా వేలాదిమంది లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ మధ్యలో రెండో శనివారం, ఆదివారం సెలవులు వచ్చాయి. సోమవారం జిల్లావ్యాప్తంగా సర్వర్ పనిచేయకపోవడంతో ధ్రువపత్రాల కోసం దరఖాస్తు చేసుకున్న సెలవులు తాము ఎక్కడ వెనుకబడిపోతామన్న ఆందోళనలో పడ్డారు.

దీనికి తోడు దరఖాస్తులను ప్రాసెస్ చేయాల్సిన సచివాలయం, మీసేవ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి.దీంతో లబ్ధిదారులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. సంబంధిత అధికారులు సమావేశాల పేరిట కార్యాలయాలకు రాకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. బుధవారం చివరిరోజు కావడంతో ఎంత మంది లబ్ధిదారులు దరఖాస్తు చేసుకుంటారో చూడాల్సి ఉంది. ప్రభుత్వం దరఖాస్తు తేదీని పొడిగిస్తే మరింతమంది లబ్ధిదారులు దరఖాస్తు చేసుకునే అవకాశం వుంటుంది.

తుదిదశకు టీచర్ల

సీనియారిటీ జాబితా

సీనియారిటీ జాబితా తయారీపై సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీఈవో వరలక్ష్మి



- ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిగా ప్రక్రియ
- రెండ్రోజులు గడువు పొడిగించిన విద్యాశాఖ

చిత్తూరు సెంట్రల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం త్వరలో డీఎస్సీ ప్రకటించనున్న నేపథ్యంలో విద్యాశాఖ చేపట్టిన టీచర్ల సీనియారిటీ జాబితా తయారీ ప్రక్రియ తుది దశకు చేరుకుంది. వాస్తవానికి సీనియారిటీ జాబితా సమర్పణ గడువు ముగిసినా, క్షేత్ర స్థాయిలో తలెత్తిన సాంకేతిక, ఇతర కారణాలతో విద్యాశాఖ మరో రెండ్రోజులు పొడిగించింది. దీనిపై డీఈవో వరలక్ష్మి మంగళవారం తన చాంబర్‌లో ఏడీ రంగస్వామి, సూపరింటెండెంట్లు, సిబ్బందితో కలిసి సమీక్షించారు. సీనియారిటీ జాబితా ఇప్పటి వరకు 82 శాతం పూర్తయిందని, ఎక్కడా పొరపాట్లు ఉండకూడదని చెప్పారు.

ఉమ్మడి చిత్తూరు జిల్లా కేంద్రంగా డీఈవో కార్యాలయంలో చిత్తూరు, అన్నమయ్య, తిరుపతి జిల్లాల్లోని ప్రభుత్వ, జడ్పీ, మున్సిపల్ యాజమాన్యాల టీచర్ల సీనియారిటీ జాబితా తయారీ ప్రక్రియ తుది దశకు చేరుకుంది. 1988 - 2018 మధ్య కాలంలో నిర్వహించిన ఏడు డీఎస్సీల ఆధారంగా టీచర్ల సీనియారిటీ జాబితా తయారు చేస్తున్నారు.ఇందుకోసం ఉమ్మడి చిత్తూరు జిల్లాల సిబ్బంది ఎనిమిది బృందాలుగా పనిచేస్తున్నారు. ఇప్పటికే టీచర్స్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (టీఐఎస్)లో టీచర్లు, వారి సర్వీసు వివరాలతో డీఈవో కార్యాలయంలోని రికార్డులను పోల్చిచూశారు. ఇది కాకుండా హెచ్‌ఎంలు పాఠశాల స్థాయిలో టీచర్ల సీనియారిటీ వివరాలు నమోదు చేసి ఎంఈవోల లాగిన్‌కు, ఆపై డీఈవో లాగిన్‌కు పంపడంతో అక్కడి ప్రత్యేక టీమ్ ఎంఈవోలు పంపిన టీచర్ల వివరాలు, రికార్డుల పునఃపరిశీలన చేస్తున్నారు.

ఉమ్మడి చిత్తూరు జిల్లా సమాచారం

ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు	4392
స్కూల్ అసిస్టెంట్ (ఎస్‌ఏ)	
పోస్టులు మంజూరు	8435
పనిచేస్తున్న ఎస్‌ఏలు	7534
ఖాళీలు	901
సెకండరీ గ్రేడ్ టీచర్ల (ఎస్జీటీ)	
పోస్టుల మంజూరు	8295
పనిచేస్తున్న ఎస్జీటీలు	6443
ఖాళీలు	1852

నేడు, రేపు డెస్క్ వెరిఫికేషన్

హెచ్‌ఎంల సీనియారిటీ జాబితాను ఇప్పటికే విద్యాశాఖ సెంట్రల్ డెస్క్‌కు పంపింది.బుధవారం ఎస్జీటీలు, గురువారం ఎస్‌ఏల జాబితాలను పూర్తి స్థాయిలో డెస్క్ వెరిఫికేషన్ ద్వారా రాష్ట్ర విద్యాశాఖకు పంపనున్నారు. ఇందుకోసం డీఈవో కార్యాలయంలో సిబ్బంది ముమ్మర కసరత్తు చేస్తున్నారు.

82 శాతం ప్రక్రియ పూర్తి : ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 4392 ప్రభుత్వ, జడ్పీ, మున్సిపల్ యాజమాన్యాల్లో పనిచేస్తున్న 14,385 మంది టీచర్ల సీనియారిటీ జాబితాలో ఇప్పటి వరకు 11,805 మంది రికార్డులు పరిశీంచి (82 శాతం) పూర్తి చేయగా, 2580 రికార్డులు పరిశీలించాల్సి ఉంది.408 పాఠశాలల రెగ్యులర్ హెచ్‌ఎంల సీనియారిటీ జాబితా ఇప్పటికే పూర్తి చేసిన విషయం తెలిసిందే. స్కూల్ అసిస్టెంట్ (ఎస్‌ఏ) కేటగిరీలో 8435 మందికిగాను 901 ఖాళీలుండగా, 7,534 మంది పనిచేస్తున్నారు. వీరిలో ఇప్పటి వరకు 5,134 మంది సీనియారిటీ జాబితా సిద్ధం చేయగా, 2,400 మందివి చేయాల్సి ఉంది. సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్జీటీ) 8295 మందికిగాను 1,852 ఖాళీలుండగా, 6,443 మంది పనిచేస్తున్నారు. వీరిలో ఇప్పటివరకు 6,263 మంది సీనియారిటీ జాబితా సిద్ధం చేయగా, కేవలం 180 మందివి రికార్డులు పునఃపరిశీలన చేయనున్నట్లు డీఈవో తెలిపారు.



మణిదీప్‌రెడ్డి



నిఖిల్



యశ్విత



ఓఎం శర్మ



జీవన్‌కుమార్



నిఖిల్

జేఈఈ మెయిన్స్‌లో మెరిశారు

- పలువురికి అత్యుత్తమ పర్సంటైల్ మార్కులు

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఐఐటీ, ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీలలో ప్రవేశాలకోసం నేషనల్ టెస్టింగ్ ఏజన్సీ(ఎన్టీఏ) ఆధ్వర్యంలో గతనెలలో నిర్వహించిన జేఈఈ మెయిన్స్ తొలివిడత ఫలితాలను మంగళవారం సాయంత్రం విడుదల చేశారు ఈఫలితాల్లో తిరుపతిలోని పలు ప్రైవేట్ జూనియర్ కళాశాలలో చదివే పలువురు విద్యార్థులు అత్యుత్తమ పర్సంటైల్ మార్కులు సాధించి సత్తా చాటారు. వీరిలో నారాయణ విద్యాసంస్థలకు చెందిన ఎం.భానుచరణ్‌రెడ్డి(99.99 పర్సంటైల్), డి.మణిదీప్‌రెడ్డి (99.98), కె.నిఖిల్ (99.98), టీపీ ధనుష్ (99.97), కార్తీక్ శ్రీలక్ష్మీపతి (99.93), కె.యశ్విత (99.90), శ్రీచైతన్య విద్యాసంస్థలకు చెందిన కె.అభిరామ్ (99.83), ఓరుగంటి మోక్షిత్ శర్మ (99.83), కె.జీవనకుమార్ (99.26), వై.నిఖిల్ (99.08), బీవీకే జూనియర్ కళాశాల (అమరావతి ఐఐటీ అకాడమీ)కు చెందిన బి.అరుణ్‌కుమార్‌రెడ్డి (99.93), శ్రీధర్స్ ఐఐటీ, జేఈఈ-నీట్ అకాడమీ విద్యార్థి పి.నిఖిలేశ్వర్ (99.25) పర్సంటైల్ మార్కులు సాధించి ప్రతిభచాటారని నిర్వాహకులు పేర్కొన్నారు.

సత్తాచాటిన అధ్యాపకుడి కుమారుడు

శ్రీకాళహస్తి మండలం గుంటకిందపల్లెకి చెందిన ప్రైవేట్ కళాశాల అధ్యాపకుడు మాండవీపురం జయభారత్‌రెడ్డి, రేఖ దంపతుల కుమారుడు భానుచరణ్‌రెడ్డి 99.99 పర్సంటైల్ మార్కులతో సత్తాచాటారు. 'ఐఐటీయే లక్ష్యంగా ప్రణాళిక రూపొందించుకుని సాధన చేస్తున్నా. ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్యపుస్తకాలను అధ్యయనం చేశా. కళాశాలలో టీచర్లు బోధించే అంశాలను క్రమం తప్పకుండా సాధన చేశా. అడ్వాన్స్‌లో మంచి పర్సంటైల్ సాధించి ఐఐటీలో ఇంజినీరింగ్ చేయాలన్నది ఆశయం' అని భానుచరణ్‌రెడ్డి పేర్కొన్నారు.



భానుచరణ్‌రెడ్డి

ప్రతిభచాటిన ప్రభుత్వ టీచర్ కుమారుడు

శ్రీకాళహస్తికి చెందిన ప్రభుత్వ టీచర్ శ్రీనివాసబాబు, రాధిక దంపతుల కుమారుడు కె.అభిరామ్ 99.83పర్సంటైల్ మార్కులతో ప్రతిభచాటారు. 'ఐఐటీలో సీటు సాధనే లక్ష్యంగా అభ్యసన సాగించడంతో మంచి పర్సంటైల్ వచ్చింది. కళాశాలలో టీచర్స్ చెప్పిన నోట్స్, మెటీరియల్, టెక్నిక్స్‌ని క్రమం తప్పకుండా అనుసరించా. అడ్వాన్స్‌లో మంచి పర్సంటైల్ సాధించి ఐఐటీలో ఇంజినీరింగ్‌విద్యని చదవాలన్నది నా లక్ష్యం' అని అభిరామ్ చెప్పారు.



అభిరామ్

రైతు ఇంట విద్యాకుసుమం

తంబళ్లపల్లె నియోజకవర్గంలోని కుక్కరాజుపల్లెకి చెందిన రైతు రఘురామ్‌రెడ్డి, రమాదేవి దంపతుల కుమారుడు అరుణ్‌కుమార్‌రెడ్డి 99.83 పర్సంటైల్ సాధించారు. 'టీచర్లు చెప్పే పాఠాలను శ్రద్ధగా విని.. నిరంతరం సాధన చేయడం వల్ల మంచి పర్సంటైల్ వచ్చింది. కెమిస్ట్రీకి ఎన్‌సీఈఆర్టీ బుక్స్, గణితం, ఫిజిక్స్ సబ్జెక్టులలో అధ్యాపకులు బోధించిన నోట్స్‌ని ప్రణాళిక ప్రకారం అధ్యయనం చేశా. ఐఐటీలో సీటు సాధించాలన్నది ఆశయం' అని అరుణ్‌కుమార్ రెడ్డి చెప్పారు.



అరుణ్‌కుమార్‌రెడ్డి

రాణించిన టీవీ టెక్నీషియన్ కుమారుడు

తిరుపతి నగరం జీవకోనకు చెందిన టీవీ టెక్నీషియన్ దయాకర్, మహేశ్వరి దంపతుల కుమారుడు పి.నిఖిలేశ్వర్ 99.25పర్సంటైల్ మార్కులు పొందారు. 'కళాశాలలో అధ్యాపకులు బోధించిన టెక్నిక్స్ ఉపయోగపడ్డాయి. ఐఐటీలో సీటు సాధించాలన్న ఆశయంతో ప్రణాళిక ప్రకారం అధ్యయనం చేశా. ఐఐటీలో కంప్యూటర్‌సైన్స్ ఇంజినీరింగ్ చేయాలన్నది లక్ష్యం' అని చెప్పారు నిఖిలేశ్వర్.



నిఖిలేశ్వర్

చెన్నై-బెంగళూరు కారిడార్‌కు పచ్చజెండా

- రూ.78.84 కోట్ల నష్టపరిహారం విడుదల

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): చెన్నై, బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్ ప్రాజెక్టులో అభివృద్ధి కోసం ప్రభుత్వం రైతులకు నష్టపరిహారం అందజేయడానికి రూ.78.84 కోట్లు మంజూరు చేసిందని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో మంగళవారం ఆయన సమీక్షించారు. చెన్నై, బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడర్ ప్రాజెక్టు అభివృద్ధికి కోట మండలం కొత్తపట్టణం, చిల్లకూరు మండలం తమ్మినపట్టణంలో ప్రభుత్వ భూమిలో సాగులోని రైతులకు క్షేత్రస్థాయిలో పరిశీలించి నష్టపరిహారం అందించలన్నారు. సాగులోని భూములను సర్వే చేసి, క్షేత్రస్థాయిలో నిర్ధారణ చేసుకున్న తరువాత నష్టపరిహారం పంపిణీ చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు.



ఎందుకో...ఏమో!

- వైసీపీలో గాలి జగదీష్ చేరిక వాయిదా
- కారణాలపై రకరకాల ఊహాగానాలు, ప్రచారాలు

నగరి/పుత్తూరు అర్బన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): నగరి నియోజవర్గంలో రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. ముఖ్యంగా వైసీపీలో కలకలం రేగింది. మాజీ మంత్రి గాలి ముద్దుకృష్ణమ నాయుడు చిన్న కుమారుడు గాలి జగదీష్ నేడు వైసీపీలో చేరాల్సి వుండగా హఠాత్తుగా చేరిక వాయిదా పడింది.ఏ రాజకీయ పార్టీలోనూ లేకుండా అడపాదడపా నియోజకవర్గంలో పర్యటించి వెళుతున్న గాలి జగదీష్ బుధవారం తాడేపల్లిలో మాజీ సీఎం జగన్ సమక్షంలో వైసీపీలో చేరేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు.మంగళవారం ఉదయాన్నే అనుచరులతో కలసి విజయవాడ బయల్దేరి వెళ్ళారు. అయితే ఏమి జరిగిందో తెలియదు కానీ బుధవారం పార్టీలో చేరే కార్యక్రమాన్ని వాయిదా వేసుకున్నట్టు తెలిసింది. ఆయన వైసీపీలో చేరాలని నిర్ణయించుకున్నట్టు, ఆ మేరకు విజయవాడ బయల్దేరి వెళ్ళినట్టు, తీరా వెళ్ళాక చేరిక వాయిదా వేసుకున్నట్టు తెలియడంతో నగరి నియోజకవర్గ రాజకీయాల్లో దీనిపై జోరుగా చర్చ నడుస్తోంది.

మాజీ మంత్రి గాలి ముద్దుకృష్ణమ నాయుడు మరణం తర్వాత కుటుంబంలో ఆయన కుమారులు గాలి భానుప్రకాష్, గాలి జగదీష్ ఎవరికి వారుగా వ్యవహరిస్తున్నారు.రాజకీయంగా ఎడమొహం పెడమొహంగా వుంటున్నారు. 2019 ఎన్నికల్లో నగరి నియోజకవర్గంలో గాలి భానుప్రకాష్ గెలుపునకు సోదరుడు సహకరించలేదన్న ప్రచారం జరిగింది. అలాగే 2024 ఎన్నికల్లోనూ అదే పరిస్థితి కనిపించింది. అప్పట్లోనే వైసీపీలో చేరేందుకు చేసిన ప్రయత్నాలు సఫలం కాలేదని తెలిసింది. గత ఎన్నికల నాటికి మాజీ మంత్రి రోజా రాజకీయంగా బలంగా వుండడం, అధిష్ఠానంలో పలుకుబడి కలిగివుండడంతో గాలి జగదీష్‌కు ప్రాధాన్యత లభించే పరిస్థితి కనిపించలేదు. అయితే గతేడాది ఎన్నికల తర్వాత పరిస్థితి మారింది. రోజా ఓడిపోవడంతో పాటు నియోజకవర్గానికి దూరమైనట్టుగా కనిపిస్తోంది.దానికితోడు వైసీపీలోనే ఆమెను వ్యతిరేకించే వర్గాలు బలంగా వున్నాయి. వీటిని పరిగణనలోకి తీసుకుని సన్నిహితులు కొందరు జగదీష్‌ను వైసీపీలో చేర్చేందుకు తెర వెనుక సన్నాహాలు చేసినట్టు సమాచారం.బుధవారం తాడేపల్లిలో జగన్ సమక్షంలో వైసీపీలో చేరేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. ముందస్తుగా జగదీష్ నియోజకవర్గవ్యాప్తంగా సన్నిహితులు, అనుచరులతో పాటు మాజీ మంత్రి రోజా వ్యతిరేక వర్గాన్ని కూడా కలసి తన చేరికకు మద్దతు ఇవ్వాల్సిందిగా కోరినట్టు సమాచారం. ఆ మేరకు ఏర్పాట్లు చేసుకుని మంగళవారం మధ్యాహ్నానికి ఆయన విజయవాడ చేరారని, గంటల వ్యవధిలో ఏమి జరిగిందో గానీ బుధవారం చేరిక కార్యక్రమాన్ని వాయిదా వేసుకుంటున్నట్టు ఆయన సన్నిహితుల ద్వారా తెలిసింది. దీంతో నియోజకవర్గంలో రకరకాల ఊహాగానాలు ప్రచారమవుతున్నాయి. కొందరు మాజీ మంత్రి రోజా ఆయన చేరికను అడ్డుకున్నారని చెబుతుండగా మరికొందరు చేరిన తర్వాత పార్టీలో తగిన ప్రాధాన్యత వుంటుందో వుండదోనన్న అనుమానం జగదీష్ వర్గీయులకు రావడంతో వాయిదా వేసుకున్నారని చెబుతున్నారు. ఆయన సన్నిహితులు మాత్రం బుధవారం జగదీష్ మాజీ సీఎం జగన్‌ను కలుస్తారని, ఆ తర్వాతే పార్టీలో చేరికపై స్పష్టత వస్తుందని చెబుతున్నారు.మొత్తం మీద ఈ వ్యవహారం నియోజకవర్గంలో అలజడి సృష్టిస్తోంది.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

ఫిర్యాదుల కోసం 1930కి ఫోన్‌చేయండన్న కలెక్టర్



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తదితరులు

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రోజురోజుకూ పెరుగుతున్న సైబర్ మోసాల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ సూచించారు. ప్రపంచ సురక్షిత ఇంటర్నెట్ దినోత్సవం సందర్భంగా మంగళవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్లో డీఏఐవో వెంకటేశ్వర్‌తో కలిసి సైబర్ మోసాలకు సంబంధించిన గోడపత్రికను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డిజిటల్ అరెస్టు, కేవైసీ, ఓటీపీ నెట్‌బ్యాంకింగ్ ఫ్రాడ్, ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్ స్కామ్, లాటరీ స్కామ్, క్రెడిట్ అండ్ డెబిట్ కార్డ్ స్కామ్, ఫేక్ యాప్స్ లోన్ స్కామ్స్, వర్క్ ఫ్రం హోమ్ స్కామ్, జాబ్ స్కామ్స్, యూపీఐ స్కామ్స్ వంటి సైబర్ మోసాల్లో యువత చిక్కుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఓటీపీ, ఆధార్, పాన్ లేదా బ్యాంకు వివరాలు ఫోన్ చేసిన అపరిచితులకు వెల్లడించరాదని సూచించారు.వ్యక్తిగత సమాచారం లేదా డబ్బులు అడిగే అనధికార కాల్స్‌కు స్పందించ కూడదన్నారు.పోలీసు, సీబీఐ, ఈడీ వంటి ప్రభుత్వ సంస్థలు వీడియో లేదా వాయిస్ కాల్స్ ద్వారా మీపై ఎటువంటి దర్యాప్తు చేయవన్నారు. సున్నితమైన లావాదేవీలకోసం వైఫైని ఉపయోగించుకోవాలని కోరారు. సైబర్ ఫిర్యాదులకోసం 1930కి కాల్ చేయాలని, లేదా www.cybercrime.gov.in వెబ్‌సైట్‌ను వినియోగించుకోవాలన్నారు.సైబర్ మోసగాళ్ళబారిన పడ్డ వాళ్లు వెంటనే జిల్లా పోలీసు వాట్సప్ నెంబరు 94409 00005 లేదా సైబర్ మిత్ర 91212 11100, సైబర్ క్రైమ్ టోల్‌ఫ్రీ నెంబరు 1930కి లేదా చిత్తూరులోని జిల్లా పోలీసు కార్యాలయంలో పనిచేస్తున్న సైబర్‌సెల్‌కు నేరుగా వచ్చి ఫిర్యాదు చేయొచ్చని ఎస్పీ మణికంఠ సూచించారు.

రిటైర్డ్ ఎంపీడీవో పెన్షన్‌లో కోత

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన కారణంగా విశ్రాంత ఎంపీడీవో పింఛనులో కోత విధిస్తూ మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.జడ్పీ అకౌంట్ సెక్షన్‌లో గతంలో ఏవోగా పనిచేసిన కనకరాజులు నాయుడు హెచ్‌బీఏ (హౌసింగ్ బిల్డింగ్ అకౌంట్)లో రికార్డులు సక్రమంగా నిర్వహించలేదని, విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించారనే అభియోగాలపై అప్పట్లో ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. విచారణ అధికారిగా అప్పటి జేసీ శ్రీనివాసులును నియమించింది. విచారణలో అభియోగాలు నిజమేనని తేలడంతో కనకరాజులు నాయుడికి వస్తున్న పింఛనులో రెండేళ్లపాటు ఐదు శాతం కోత విధిస్తూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది.

టీటీడీకి విరాళంగా ద్విచక్రవాహనాలు



తిరుమల, ఫిబ్రవరి11(ఆంధ్రజ్యోతి): శ్రీవారికి మంగళవారం రెండు ద్విచక్రవాహనాలు విరాళంగా అందాయి. చెన్నైకు చెందిన టీవీఎస్, బెంగళూరుకు చెందిన డీఎస్ ఎకో సంస్థల ప్రతినిధులు ఈ విద్యుత్ ద్విచక్రవాహనాలను అందజేశారు. టీవీఎస్ ఐ క్యూబ్ ఎక్స్ వాహనం ధర రూ.2.70 లక్షలు, ఎన్‌డీఎస్ ఎకో వాహనం ధర రూ.1.56 లక్షలు అని ప్రతినిధులు తెలిపారు. ఆలయం ముందు ఈ వాహనాలకు పూజలు నిర్వహించాక టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి సంస్థల ప్రతినిధులు తాళాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీవీఎస్ చైర్మన్ వేణు శ్రీనివాసన్, ఎండీ సుదర్శన్, ఎన్‌డీఎస్ ఎకో సంస్థ చైర్మన్ ఎంహెచ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో హీరో కార్తీ



తిరుమల, ఫిబ్రవరి11 (ఆంధ్రజ్యోతి): తమిళ హీరో కార్తీ మంగళవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. కార్తీకి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు. దర్శనం అనంతరం కార్తీ ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. త్వరలో ఖైదీ-3, సర్దార్2 చిత్రాలు అభిమానుల ముందు రాబోతున్నట్టు తెలిపారు. తన కుమారుడు పుట్టిన తర్వాత తొలిసారిగా తిరుమలకు వచ్చి శ్రీవారిని దర్శించుకున్నట్టు తెలిపారు. హీరో కార్తీని ఆలయం ముందు చూసేందుకు పలువురు అభిమానులు పోటీ పడ్డారు. తిరుచానూరు పద్మావతి అమ్మవారినీ కార్తిక్ దర్శించుకున్నారు. కాగా, తిరుమల శ్రీవారిని నటి భువనేశ్వరి దర్శించుకున్నారు.



→ ఆలయం ముందు హీరో కార్తీ - భువనేశ్వరి ←

శ్రీవారి సర్వదర్శనానికి 16 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 16 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని షెడ్లలో సర్వదర్శనం భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

ఆదివారం నాటి హుండీ ఆదాయం: రూ.4.33 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 70,169

తలనీలాలు సమర్పించినవారు: 24,559



అపాచీ, శ్రీసిటీ పారిశ్రామిక ప్రాంతంలో ఉంది కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయం. చోళరాజుల కాలం నాటి గుడి ఇది. ఆ పురాతన వాతావరణం ఆలయ ప్రాంగణంలో కనిపిస్తుంది. చినమాంబట్టు గ్రామంలో శ్రీకాశీవిశ్వేశ్వర, అన్నపూర్ణాదేవి ఆలయంగా నిత్యపూజలందుకుంటోంది. పురాతన శిల్పాలతో నిండిన ఈ ఆలయం చిన మాంబట్టు గ్రామంలో ఉంది.

- తడ, ఆంధ్రజ్యోతి

చోళ కళావైభవం

మాంబట్టు కాశీవిశ్వేశ్వరాలయం

చరిత్ర: క్రీ.శ 11వ శతాబ్దంలో నిర్మించిన ఆలయం ఇది. ఇందుకు ఆధారమైన శాసనాలు ఉన్నాయి. తొలుత గర్భగుడి, అర్ధమండపం నిర్మించారు. 13వ శతాబ్దంలో ఈ స్తంభమండపం నిర్మాణం జరిగింది. పల్లవ, చోళ శాసనాల్లో ఉన్న 'బట్టారక, పరమబట్టారక' అనే పదాలను పరిశీలిస్తే' బట్టు' అనే పదమే కాలక్రమంలో మాంబట్టు అనే ఊరి పేరుగా మారి ఉండవచ్చని భావిస్తారు.

పురాణ ప్రాశస్త్యం: ఈ గ్రామానికి చెందిన ఒక బ్రాహ్మణుడి కోరిక మేరకు చోళుల కాలంలో శివాలయాన్ని నిర్మించారు. ఆలయానికి అవసరమైన భూమిని అదే గ్రామానికి చెందిన గుంటూరు మహదేవమ్మ అందించగా, యనమండ్రం నారసింహయ్యశర్మ, వెంకటరామయ్యశర్మలు అర్చకత్వానికి సిద్ధమయ్యారు. ఆలయం అయితే పూర్తవుతుంది కానీ ప్రతిష్ఠించడానికి దేవుడు కావాలి కదా. ఈ సమయంలో కాశీ నుంచి రామేశ్వరం వెళ్తున్న ఒక యాత్రీకుడు పాలరాతి శివలింగాన్ని ఇచ్చాడు. శివుడితోపాటూ అన్నపూర్ణాదేవి విగ్రహాన్ని తయారు చేయించి ప్రతిష్ఠించారు. కాలక్రమంలో చండికేశ్వరి, దుర్గాదేవి, కాలభైరవుడు, నందీశ్వరుడు, మహావిష్ణువు, శ్రీవల్లి, దేవసమేత సుబ్రమణేశ్వరిస్వామి విగ్రహాలతోపాటు ధ్వజస్తంభం ఏర్పాటైంది. భక్తుల కోర్కెలు తీర్చే దేవుడిగా కాశీవిశ్వేశ్వరుడికి ప్రతీతి.



మాన్యం మాయం: వెంకటగిరి రాజుల పోషణ: మాంబట్టు కాశీవిశ్వేశ్వరుడి ఆలయం వద్ద తొలుత 26 బ్రాహ్మణ కుటుంబాలు అర్చకత్వంలో ఉండేవని చెబుతారు. వీరంతా ఆ తర్వాత వలస పోవడంతో ఆలయ పూజా కైంకర్యాలకు కొదవ ఏర్పడింది. పరిస్థితి వెంకటగిరి రాజుల దృష్టికి వెళ్లింది. వారు స్వామివారికి 79.43 ఎకరాలు, అమ్మణ్ణికి పసుపు, కుంకాల రూపేణ 25 ఎకరాల మాన్యం ఇచ్చారు. దాంతోనే ఆలయ ధూపదీప, నైవేద్యాలు నడిచేవి. 2006లో ఆ భూములను పరిశ్రమలకు అప్పగించడంతో ఇప్పుడు ఆ మాన్యమూ లేకుండా పోయింది.

తగ్గని వైభవం: శిథిల స్థితికి చేరుకున్న ఆలయాన్ని గ్రామస్థులే పట్టించుకుని పూర్ణోద్ధరణకు పూనుకున్నారు. ఉత్సవాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నారు. నవరాత్రి ఉత్సవాలు 9 రోజుల పాటు జరుగుతాయి. కార్తీకమాస ఉత్సవాలు మాత్రం తెలుగు, తమిళ సాంప్రదాయాల ప్రకారం రెండు నెలలపాటు నిర్వహిస్తున్నారు రోజూ రెండు పూటలా ధూపదీప, నైవేద్యాల సమర్పణ జరుగుతుంది.. గ్రామ రైతు మన్నె శంకరయ్య విరాళంగా ఇచ్చిన స్థలంలో గ్రామస్థులంతా కలిసి అన్నదాన సత్రం నిర్మించుకున్నారు. ప్రతి పౌర్ణమికీ ఇక్కడ అన్నదానం జరుగుతుంది.





శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి పాలరాతి శివలింగం - అన్నపూర్ణాదేవి

ఆలయం శ్లాబు రాతిబండలపై చెక్కిఉన్న మత్స్యం, ఉడుము, భక్తుల శిల్పాలు ఆకారాలు





శివరాత్రి ఉత్సవాలు: అంగరంగవైభవంగా నిర్వహించేవారు. శివరాత్రిని చిన్నమాంబట్టులోని ఆలయంలో, కళ్యాణోత్సవాన్ని పెద్దమాంబట్టు ఆలయంలో, పారువేట ఉత్సవాన్ని ఎస్‌ఎంకండ్రి గ్రామంలో నిర్వహిస్తూ ఉండేవారు. ఆ ఆనవాయితీ నేటి కొనసాగుతూ ఉంది.

17, 18న శాయ్ హాస్టల్ సెలక్షన్స్

తిరుపతి అర్బన్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ఈనెల 17, 18 తేదీల్లో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా హాస్టల్(యానం)సెలక్షన్స్ నిర్వహిస్తున్నట్లు డీఎస్‌డీవో సయ్యద్‌సాహెబ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తిగల బ్యాడ్మింటన్, స్విమ్మింగ్ ప్లేయర్స్ ఆ రోజుల్లో ఉదయం 9గంటలకు యానం శాయ్ ట్రైనింగ్ సెంటర్‌కు వెళ్లాల్సివుంది. బ్యాడ్మింటన్‌కు 12నుంచి 18 సంవత్సరాల వయస్సు బాలురు, స్విమ్మింగ్‌కు 12నుంచి 16 సంవత్సరాల వయస్సు బాల, బాలికలు అర్హులు. జనన ధృవీకరణపత్రం, ఆధార్, ఇప్పటి వరకు పొందిన క్రీడా ప్రశంసాపత్రాలు, గవర్నమెంట్ మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్, నాలుగు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, సొంత స్పోర్ట్స్ కిట్ తీసుకురావాలి. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాల కోసం 98662 39009 (బ్యాడ్మింటన్), 88851 76888 (స్విమ్మింగ్) నెంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

చీటీల పేరుతో మోసం

న్యాయం చేయాలంటూ పోలీసులను ఆశ్రయించిన బాధితులు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో చీటీల పేరుతో మోసం చేసి బాధితులకు రూ.5 కోట్లు మేర టోకరా పెట్టి పారిపోయిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. చీటీలు వేసి మోసపోయిన బాధితులు మంగళవారం పోలీసులను ఆశ్రయించి న్యాయం చేయాలని కోరారు. బాధితుల కథనం మేరకు...సూళ్లూరుపేట పట్టణంలోని గాయత్రినగర్‌లో నివాసం ఉంటున్న కొటారు రమేష్ చీటీల పేరుతో పాత షార్ బస్టాండు వద్ద ఓ కార్యాలయాన్ని ప్రారంభించి పరిసర ప్రాంతాలకు చెందిన వ్యక్తులతో చీటీలు వేయించారు.దాదాపు 25 మందికి పైగా చీటీలు వేశారు. నెల రోజుల నుంచి చీటీలు పాడిన వారికి రమేష్ నగదు ఇవ్వడం లేదు. ఈ నేపథ్యంలో రమేష్ నివాసం ఉంటున్న ఇల్లు, పాత షార్ బస్టాండు వద్దనున్న కార్యాలయం వారం రోజులుగా తెరవకపోవడంతో చుట్టు పక్కల వారిని చీటిలు వేసిన వారు విచారించారు.ఊరొదిలి పోయాడని తెలియడంతో పోలీస్ స్టేషన్‌కు చేరుకొని గోడు వినిపించారు.

ప్రతి రైతుకూ గుర్తింపు సంఖ్య

తిరుపతి(ఎంఆర్‌పల్లె), ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ప్రతిరైతుకు గుర్తింపు సంఖ్యను కేటాయిస్తున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్‌కార్డులాగే రైతుకు 11 అంకెలతో యూనికోడ్‌ని కేటాయించడానికి కేంద్రం నిర్ణయించిందన్నారు. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా డిజిటలైజేషన్ చేయడానికే ఈ ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు. ప్రస్తుతం భూ యజమానులకు మాత్రమే ఫార్మర్ రిజిస్ట్రీ జరుగుతోందన్నారు. తొలుత పీఎం కిసాన్ లబ్ధిదారులకు.. ఆ తర్వాత మిగిలిన భూ యజమానులకు రిజిస్ట్రీ నెంబర్లు జారీ చేస్తారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు పొందాలంటే భూ యజమానులు తప్పనిసరిగా రైతు రిజిస్ట్రీలో నమోదు చేసుకోవాలని తెలిపారు. రైతులందరూ తమపేరు, గ్రామం, ఆధార్ నెంబరు, పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ లింక్ అయిన ఫోన్ నెంబరు వివరాలను సమీపంలోని రైతు సేవాకేంద్రంలో సిబ్బందికి ఇచ్చి నమోదు చేసుకోవాలన్నారు. ఈ ప్రక్రియ పూర్తయితే ఒక విశిష్ట గుర్తింపు సంఖ్య పొందవచ్చన్నారు. వెళ్లలేని పరిస్థితిలో ఫోన్ ద్వారా రైతు సేవా కేంద్రంలోని సిబ్బందికి వివరాలు తెలిపి ఓటీపీ ద్వారా నమోదు చేసుకోవచ్చని వివరించారు. ఈ నెల 25వ తేదీ లోపు నమోదు చేసుకోవాలన్నారు.

అసంఘటిత కార్మికులంతా 'ఈశ్రమ్' పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ప్రతి అసంఘటిత కార్మికుడు తన వివరాలను ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకుని, సంక్షేమ పథకాలు పొందాలని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. ఈ-శ్రమ్ పోర్టల్‌పై మంగళవారం ఆయన కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షించారు. 16-59 సంవత్సరాల వరకు కార్మికులు అర్హులన్నారు. కార్మికుడి ఆధార్‌కార్డు, ఆధార్ లింకుతో ఫోన్, బ్యాంకుఖాతా వివరాలు ఉంటే ఈ పథకంలో చేరవచ్చన్నారు.

ముక్కంటి సేవలో గాయకులు



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 11 (ఆంధ్ర జ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని ప్రముఖ గాయకులు రమ్య బెహరా, అనురాగ్ కులకర్ణి మంగళవారం దర్శించుకున్నారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

వారం రోజుల్లో 41.5 కిలోల గంజాయి సీజ్

- బహిరంగ మద్యపానాలపై 913 కేసులు

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గంజాయి రవాణాకు అడ్డుకట్ట వేస్తున్నామని ఎస్పీ హర్షవర్ధనరాజు తెలిపారు. వారాంతపు నివేదికను మంగళవారం ఆయన మీడియాకు విడుదల చేసి మాట్లాడారు. రాత్రి, పగలు గస్తీ పెంచామన్నారు. అనుమానాస్పద స్థితిలో తిరుగుతున్న వారిపై నిఘా పెంచామన్నారు. ఈ వారం రోజుల వ్యవధిలో రాత్రి పూట రోడ్లపైన తిరుగుతున్న 165 మంది అనుమానితులను ఆయా పోలీసు స్టేషన్లకు తీసుకెళ్లి కౌన్సిలింగ్ ఇచ్చామన్నారు. గంజాయి రవాణా, విక్రయాలపై కఠినంగా వ్యవహరించి దాదాపు 41.5 కిలోలు సీజ్ చేసినట్లు చెప్పారు. బహిరంగంగా మద్యం తాగుతున్న వారిపై 913 కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా జరిమానా విధించినట్లు వివరించారు. బహిరంగంగా మద్యం తాగే 81 ప్రాంతాలను గుర్తించి అక్కడ అవగాహన బ్యానర్లు ఏర్పాటు చేశామన్నారు. 119 మందిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేసి కౌన్సిలింగ్ ఇచ్చామన్నారు. విద్యాసంస్థలు, యూనివర్శిటీలకు సమీపంలోని బడ్డీ కొట్టులు, దుకాణాలు, కిరాణా షాపుల వద్ద ఆకస్మిక తనిఖీలు చేసి గంజాయి, మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరిస్తున్నామన్నారు. పుత్తూరు, తిరుపతి, తిరుపతి రూరల్, శ్రీకాళహస్తి, నాయుడుపేట, నాగలాపురం, చంద్రగిరి ప్రాంతాల్లో.. విద్యాసంస్థలకు సమీపంలో ఉన్న దుకాణాల్లో మంగళవారం పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేశారు. రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసులు నేతృత్వంలో పలు ప్రదేశాల్లో తనిఖీలు చేశారు.

రైలు ఢీకొని గ్యాంగ్‌మేన్ దుర్మరణం

- మరొకరికి తీవ్ర గాయాలు



ఏఆర్ అభిషేక్ (ఫైల్‌ఫొటో)

తడ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొనడంతో విధుల్లో ఉన్న ఓ గ్యాంగ్‌మేన్ దుర్మరణం చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. తడ మండలం అనపగుంట రైల్వేగేటు సమీపంలో ఐదుగురు సభ్యులతో కూడిన గ్యాంగ్‌మెన్ మంగళవారం పట్టాలపై గేజ్ లెవల్ తనిఖీ చేపట్టారు. ఈ బృందంలోని మేస్త్రీ దగ్గరలోని గేటు వద్దకు వెళ్లి గేట్‌మ్యాన్‌తో మాట్లాడుతుండగా, మరో ఇద్దరు తాగునీటి కోసం పక్కకు వెళ్లారు. మిగిలిన ఏఆర్ అభిషేక్(30), ముంజయ్ కుమార్ పని చేస్తుండగా నాగర్ కర్నూల్ నుంచి ఎర్నాకులం వెళ్తున్న సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ వేగంగా దూసుకొచ్చింది. దీంతో బిత్తరపోయిన ముంజయ్ కుమార్ పట్టాలపై నుంచి ఎగిరి పక్కకు దూకగా, అభిషేక్ పట్టాలు దాటేందుకు ప్రయత్నిస్తుండగా ఎక్స్‌ప్రెస్ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందారు. ముంజయ్ కుమార్ కాలు విరిగి తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. గాయపడిన ముంజయ్ కుమార్‌ను 108 వాహనంలో సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం చెన్నై రైల్వే ఆస్పత్రికి తీసుకెళ్లారు. మృతి చెందిన అభిషేక్ స్వస్థలం కేరళ రాష్ట్రం కాగా, గాయపడిన ముంజయ్ కుమార్ బీహార్‌వాసి. పట్టాలపై గ్యాంగ్‌మెన్ విధులు నిర్వహిస్తున్న సమయంలో రైళ్ల రాకపోకల సమయాన్ని తెలుసుకొంటూ సిబ్బందిని అప్రమత్తం చేయాల్సిన మేస్త్రీ నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం జరిగినట్లు రైల్వే అధికార వర్గాలు భావిస్తున్నట్లు తెలిసింది.

సర్వలెన్స్ ప్రాజెక్ట్ ఫైనల్ మెరిట్ లిస్టు విడుదల

తిరుపతి(వైద్యం), ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ఏఎంఆర్ సర్వలెన్స్ ప్రాజెక్టు, న్యూఢిల్లీలోని నేషనల్ సెంటర్ ఫర్ డిసీస్ కంట్రోల్(ఎన్‌సీడీసీ) ఆధ్వర్యంలో గత నెల ఇచ్చిన నోటిఫికేషన్‌కు సంబంధించి ఫైనల్ మెరిట్ లిస్టును విడుదల చేసినట్లు ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫలితాలను ఎస్వీ వైద్య కళాశాల వెబ్‌సైట్‌లో చూసుకోగలరని ఆయన తెలిపారు.

పుస్తకమే పతాకం..!

- పుస్తక ప్రదర్శనపై దాడిని ఖండిస్తూ తిరుపతిలో నిరసన ర్యాలీ



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో నిర్వహించిన 17వ పుస్తక ప్రదర్శనపై జరిగిన దాడి పట్ల పుస్తకాభిమానులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరుపతి పుస్తక ప్రియుల ఐక్య వేదిక ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం బాలాజీ కాలనీలోని జ్యోతిబాఫూలే విగ్రహం నుంచి నాలుగు కాళ్ల మండపం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. రామాయణం, భారతం, భాగవతం, మహాప్రస్థానం సహా ఎవరికి నచ్చిన పుస్తకాలను వారు జెండాలా చేతపట్టుకుని ప్రదర్శిస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. టౌన్‌క్లబ్, ఎస్పీ ఆఫీస్, ప్రకాశం రోడ్డు, పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం కూడలి, గాంధీ రోడ్డు మీదుగా నాలుగుకాళ్ళ మండపం దాకా ర్యాలీ సాగింది. 'నూరు పూలు వికసించనీ, వేయి ఆలోచనలు సంఘర్షించనీ', 'పుస్తకాలు జ్ఞాన నేత్రాలు, పుస్తకాలను చింపినంత మాత్రాన, పుస్తకాల్లోని భావాలను చంపలేరు' అంటూ నినదించారు. ర్యాలీలో భాగంగా తిరుపతి గాంధీరోడ్డులో గల విశాలాంధ్ర బుక్ హౌస్ ఎదురుగా నిలబడి సంఘీభావాన్ని వ్యక్తం చేశారు. నాలుగు కాళ్ల మండపం వద్ద నిలబడి నిరసన తెలిపారు. పుస్తకప్రియులను ఉద్దేశించి పలువురు రచయితలు, ప్రజాసంఘాల నాయకులు ప్రసంగించారు. ఏ పుస్తకాలు చదవాలో, ఏ పుస్తకాలు చదవకూడదో నిర్ణయించడానికి ఎవరికీ హక్కు లేదని స్పష్టం చేశారు. పుస్తక ప్రదర్శనలోని ఒక స్టాల్ నుంచి పుస్తకాన్ని లాక్కొని, చించి పోగులు పెట్టి, దహనం చేయడానికి ప్రయత్నించిన దుండుగులపై చర్యలు తీసుకోవాలని కోరారు. విశాలాంధ్ర బుక్ స్టాల్‌పైనా దాడి చేసి స్వాతంత్ర్య సమరయోధుడు పెరియార్ పుస్తకాలు అమ్మరాదని ఆదేశించి, తీసేయించడం దారుణమన్నారు.

ఈ సందర్భంగా తిరుపతి పుస్తక ప్రియుల ఐక్య వేదిక అధ్యక్షుడు వాకా ప్రసాద్ మాట్లాడుతూ.. పుస్తకాలపై దాడి హేయమైన చర్య అని అన్నారు. ఇలాంటి చర్యలు ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగించేలా ఉన్నాయని అభిప్రాయపడ్డారు. శ్వేత మాజీ డైరెక్టర్ భూమన్, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, ఎస్వీయూ ఇంగ్లీషు రిటైర్డు ప్రొఫెసర్ మధురాంతకం నరేంద్ర, డాక్టర్ కడియాల వెంకటరమణ (అభ్యుదయ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు), సీనియర్ జర్నలిస్టు ఆలూరి రాఘవ, రచయితలు ఆర్‌ఎం ఉమామహేశ్వరరావు, మూరిశెట్టి గోవిందు, పేరూరు బాలసుబ్రమణ్యం, గొడుగుచింత గోవిందయ్య, నాగులూరు దయాకర్ పాల్గొన్నారు. ఇంకా నిర్మల, రెడ్డెప్ప (జన విజ్ఞాన వేదిక), వెంకటరమణ (సాహితీ స్రవంతి), మల్లారపు నాగార్జున (వేమన విజ్ఞాన కేంద్రం), నడ్డి నారాయణ (బాలోత్సవం), పరమేశ్వరరావు (పౌర చైతన్య వేదిక), సాకం నాగరాజ (జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు), యువశ్రీ మురళి (అభ్యుదయ రచయితల సంఘం జిల్లా అధ్యక్షులు), నెమిలేటి కిట్టన్న (అరసం జిల్లా కార్యదర్శి), తమటం రామచంద్రారెడ్డి (తెలుగు భాషోద్యమ సమితి),కందారపు మురళి (సీఐటీయూ), డాక్టర్ పి.సాయిలక్ష్మి (ఐద్వా జిల్లా కార్యదర్శి), లక్ష్మి (ఎస్‌యూసీఐ), వందవాసి నాగరాజు (సీపీఎం జిల్లా కార్యదర్శి), రామా నాయుడు (సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు), అంజయ్య (దళిత సాహిత్య వికాస వేదిక), వెంకటరత్నం (సీనియర్ కమ్యూనిస్టు నేత), ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షుడు చిన్నం పెంచలయ్య, సీపీఐ నగర కార్యదర్శి విశ్వనాథ్, బీసీ సంఘర్షణ సమితి నేత లక్ష్మయ్య, యమలా సుదర్శన్ (దళిత శంఖారావం పత్రిక ఎడిటర్), జర్నలిస్టు సంఘం నాయకుడు ప్రసాద్, మస్తానమ్మ (శంకరంబాడి సాహిత్య పీఠం) తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

పిచ్చాటూరు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ భరించలేక ఓ రైతు పొలంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పిచ్చాటూరు మండలం ముడియూరు పంచాయతీ లక్ష్మీవిలాసపురం గ్రామానికి చెందిన వై.చిట్టిబాబు(50)కు ఒకటిన్నర ఎకరా ఉంది. వరి, వేరుశనగ, చిక్కుడు తోట సాగుచేశారు. వచ్చిన కాస్త దిగుబడి గత తుఫాను వల్ల నష్టపోయారు. సాగుకు బ్యాంకులు, ప్రైవేటు వ్యక్తుల వద్ద సుమారు రూ.5 లక్షల వరకు అప్పు చేశారు. ఈ క్రమంలో కుటుంబ పోషణ భారమైంది. అప్పు తీర్చే మార్గం కనిపించక సోమవారం మధ్యాహ్నం తన పొలంలో పురుగుల మందు తాగి పడిపోయారు. స్థానికులు గుర్తించి 108లో నగరి ఏరియా ఆస్పత్రికి.. అక్కడ్నుంచి తిరుపతి రుయాకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందారు. మృతుడికి భార్య సఖిల, పిల్లలు కార్తీక్, ఆశ ఉన్నారు.



చిట్టిబాబు (ఫైల్ ఫొటో)

భర్త హత్య కేసులో బెయిల్‌పై వచ్చి ఆత్మహత్య



మృతి చెందిన సుజాత

రేణిగుంట, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): భర్త హత్య కేసులో బెయిల్‌పై వచ్చిన భార్య మనస్తాపంతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన రేణిగుంట మండలం కొత్రమంగళంలో చోటుచేసుకుంది. చెంగారెడ్డిపల్లి హరిజనవాడకు చెందిన కె.సుజాత(37), ఈశ్వరయ్య దంపతులు. నిత్యం మద్యంతాగొచ్చి అనుమానంతో భార్యను వేధించేవాడు. గతేడాది అక్టోబరు 23న దంపతుల మధ్య ఘర్షణ జరిగింది. ఆ గొడవలో భర్త తలపై బలంగా కొట్టడంతో అతడు మృతిచెందాడు. ఈ హత్య కేసులో రిమాండ్‌లో ఉన్న సుజాత పది రోజుల క్రితం బెయిల్‌పై విడుదలైంది. ఇంటికి రాగా, పిల్లలు ఆమెను దూరం పెట్టారు. గ్రామంలోనూ ఎవరూ పలకరించలేదు. దీంతో మనస్తాపానికి గురైన ఆమె.. కొత్రమంగళం హరిజనవాడలోని అంగన్వాడీ టీచర్ అయిన తన కోడలి ఇంటికి చేరింది. సోమవారం రాత్రి పాత పంచాయతీ భవనంలోని ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మంగళవారం ఉదయం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోలీసులు శవపరీక్ష నిమిత్తం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. ఎస్‌ఐ సుధాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్విమ్స్ రేడియోలాజికల్ ఫిజిక్స్ లెక్చరర్ పోస్టులకు వాక్‌ఇన్ ఇంటర్వ్యూ

తిరుపతి(వైద్యం), ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): స్విమ్స్‌లో అడహక్ బేసిస్ కన్సాలిడేటెడ్ ప్రాతిప్రదికన రేడియోలాజికల్ ఫిజిక్స్(మెడికల్ ఫిజిసిస్ట్) లెక్చరర్ పోస్టులకు ఈ నెల 19న వాక్‌ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ అపర్ణ ఆర్ బిట్లా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం నాలుగు పోస్టులు ఖాళీగా ఉన్నాయని.. రిజర్వేషన్ కింద ఎస్టీ 1, బీసీ-బి 1, ఈడబ్ల్యూఎస్ 1, ఓసీ 1 కింద ఈ నాలుగు పోస్టులకు దరకాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆమె తెలిపారు. 42 ఏళ్ల లోపు వారు అర్హులని.. ఎంపికైన వారికి నెలకు రూ.61 వేల వేతనం ఉంటుందని ఆమె వివరించారు. వీటికి హిందూ మతానికి చెందిన వారు మాత్రమే అర్హులన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 19న పాత డైరెక్టరు కార్యాలయంలో నిర్వహించే వాక్‌ఇన్ ఇంటర్వ్యూకు అన్నీ ధృవీకరణ పత్రాలతో హాజరుకాగలరని ఆమె వివరించారు. పూర్తి వివరాలకు స్విమ్స్ వెబ్‌సైట్‌ను చూడగలరన్నారు.

ఎర్రచందనం రవాణా కేసులో నిందితుడికి ఏడాది జైలు

- కింది కోర్టు తీర్పునే ఖరారు చేసిన ఎర్రచందనం సెషన్స్ కోర్టు అదనపు జిల్లా న్యాయమూర్తి

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో నిందితుడికి ఏడాది జైలు శిక్ష, రూ.పది వేల జరిమానా విధిస్తూ తిరుపతి ఎర్రచందనం సెషన్స్ కోర్టు ఏడీజే న్యాయమూర్తి నరసింహమూర్తి మంగళవారం తీర్పుచెప్పారు. దీనికి సంబంధించి ఫారెస్టు అధికారి, కోర్టు సహాయ లైజన్ అధికారి వెంకటేశ్వర్లు తెలిపిన ప్రకారం.. తమిళనాడు రాష్ట్రం వేలూరు జిల్లా తిరుపత్తూరుకు చెందిన స్వామినాథన్ అన్నామలై 2014లో శేషాచలం నుంచి చంద్రగిరి మండలం నడింపల్లి బస్టాపు వద్దకు స్మగ్లర్లు తీసుకొచ్చిన 292 కిలోల బరువు కల తొమ్మిది ఎర్రచందనం దుంగలను తమిళనాడుకు తరలించడానికి వాహనంలో ఎక్కిస్తున్నాడు. అటవీశాఖ అధికారులు పట్టుకుని అరెస్టు చేసి, కేసు నమోదు చేశారు. ఇరు వర్గాల వాదనలు విన్న న్యాయమూర్తి 2018లో ఏడాది జైలు శిక్ష, రూ 10,000 జరిమానా విధించారు. దీనిపై నిందితుడు తిరుపతి ఎర్రచందనం సెషన్స్ కోర్టుకు వెళ్లారు. కింది కోర్టు తీర్పును యథావిధిగా అమలు చేయాలని ఎర్రచందనం సెషన్స్ కోర్టు అదనపు జిల్లా న్యాయమూర్తి నరసింహమూర్తి ఆదేశించారు. ఈ కేసులో స్పెషల్ పీపీ కోటేశ్వరరెడ్డి వాదనలు వినిపించారు. లైజన్ అధికారులుగా జె.చంద్రశేఖర రాజు, సహాయ లైజన్ అధికారులుగా వెంకటేశ్వర్లు వ్యవహరించారు.

ఉత్తుత్తిగా నడుస్తున్న కుప్పం మున్సిపాలిటీ నిజంగానే మున్సిపాలిటీ అయిపోయింది. పంచాయతీ సిబ్బందితోనే కాలక్షేపం చేస్తూ నెట్టుకొస్తున్న యంత్రాంగం సంఖ్య పెరగనుంది. కుప్పం మున్సిపాలిటీతోపాటు రాష్ట్రంలోని మొత్తం 12 నగర పంచాయతీలు, మున్సిపాలిటీలకు 176 పోస్టులను మంజూరు చేస్తూ ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వులు నిజమైన మున్సిపాలిటీలకు భాష్యం చెప్పాయి. ప్రత్యేకించి ఇందులో కుప్పం మున్సిపాలిటీకి 44 పోస్టులు మంజూరయ్యాయి.

నూతన శకం దిశగా కుప్పం మున్సిపాలిటీ

- ఇప్పటిదాకా పంచాయతీ సిబ్బందితోనే కాలక్షేపం
- ఈవో పోస్టులోనే కమిషనర్
- ఇప్పుడు మున్సిపల్ శాఖలోకి మార్పు
- పురపాలికకు కొత్తగా 44 పోస్టుల మంజూరు



కుప్పం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీగా ఉన్న కుప్పాన్ని పరిసరాల్లోని మరో 6 పంచాయతీలను కలుపుతూ 2020లో పురపాలక సంఘం చేస్తూ అప్పటి వైసీపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నిజానికి కుప్పాన్ని మున్సిపాలిటీ చేయాలన్న ప్రతిపాదనలు 2014-2019లో కొనసాగిన టీడీపీ ప్రభుత్వ హయాంలోనే రూపొందాయి. మొత్తం పరిసర పంచాయతీలను మున్సిపాలిటీ పరిధిలో చేర్చడానికి అప్పట్లోనే కసరత్తు జరిగింది. కుప్పం, లక్ష్మీపురం, సామగుట్టపల్లె, కమతమూరు, అనిమిగానిపల్లె, డీకే.పల్లె, చీలేపల్లె పంచాయతీల నుంచీ ఈ మేరకు తీర్మానాలు కూడా చేయించారు. అయితే కేంద్ర ప్రభుత్వంనుంచి రూర్బన్ పథకం కింద నిధులు విడుదల కావడంతో ఆయా పంచాయతీల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని మున్సిపాలిటీ చేయాలన్న ప్రతిపాదనను అప్పటి ప్రభుత్వం వెనక్కు తీసుకుంది. మున్సిపాలిటీగా చేస్తే రూర్బన్ నిధులు ఇవ్వరన్న కారణంతో అప్పట్లో ఈ నిర్ణయం తీసుకున్నారు. అయితే తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ముందూ వెనుకలు ఆలోచించకుండా 2020లో కుప్పంతోపాటు ఏడు పంచాయతీలను కలిపి కుప్పం నగర పంచాయతీని మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేసింది.అయితే అందుకు తగ్గ సిబ్బందిని కానీ, విధివిధానాలను కానీ వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేయలేదు. అదనంగా ఒక్క పోస్టు కూడా మంజూరు కాలేదు. నగర పంచాయతీగా ఉన్నప్పుడు ఏ పోస్టులైతే ఉన్నాయో అదే పోస్టులతో కొనసాగించింది. ఈవో పోస్టు తప్ప మున్సిపల్ కమిషనర్ పోస్టు కూడా నిన్న మొన్నటిదాకా కుప్పం మున్సిపాలిటీలో లేదు. ఇక మేనేజర్, టీపీవో, ఆర్వో, ఏఈ వంటి పోస్టుల సంగతి చెప్పక్కరలేదు. వీరంతా ఎక్కడెక్కడి నుంచో డిప్యుటేషన్ మీద వచ్చి తాత్కాలికంగా కుప్పంలో విధులు నిర్వహిస్తున్నారు. మున్సిపల్ కమిషనర్ ఒక్కరికి మాత్రమే ఆయన మాతృ సంస్థ పురపాలక సంఘంనుంచి వేతనం చెల్లిస్తున్నారు. మిగిలిన సిబ్బంది పంచాయతీరాజ్ ద్వారానే వేతనాలు డ్రా చేస్తున్నారు. మున్సిపాలిటీగా మారినా సరే వైసీపీ హయాంలో కుప్పం రాత మాత్రం మారలేదు. అరకొర డిప్యూట్ ఉద్యోగులు, సిబ్బందితో పురపాలన అస్తవ్యస్తంగా తయారైంది.

టీడీపీ ప్రభుత్వం వచ్చాకే కదలిక

టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం, ముఖ్యమంత్రిగా చంద్రబాబు మరోసారి బాధ్యతలు తీసుకున్నాక కుప్పం మున్సిపాలిటీకి అవసరమైన పోస్టుల మంజూరు కోసం కసరత్తు మొదలైంది. కుప్పం మున్సిపాలిటీకి 44 పోస్టులు కావాలంటూ ప్రతిపాదనలు సిద్ధమై ప్రభుత్వానికి వెళ్లాయి. మంత్రివర్గ సమావేశంలో దీనిపై సానుకూలంగా నిర్ణయం తీసుకున్నారు . అయితే ఆర్థిక శాఖ వద్ద ఫైలు పెండింగులో ఉండిపోయింది. చివరకు ముఖ్యమంత్రి చంద్రబాబు జోక్యంతో కుప్పంతోపాటు రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన మొత్తం 12 మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు అవసరాలకు సరిపడా సిబ్బంది 176 మంది సిబ్బందిని మంజూరు చేస్తూ ఈనెల 4వ తేదీన పురపాలక పరిపాలనా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేశ్ కుమార్ ఉత్తర్వులు విడుదల చేశారు. కుప్పం మున్సిపాలిటీకి మంజూరైన 44 పోస్టులతో పరిపాలన ఇక గాడిన పడనుంది. మున్సిపల్ కమిషనర్, మేనేజర్, ఆరు సీనియర్ అసిస్టెంట్, ఆరు జూనియర్ అసిస్టెంట్ పోస్టులతోపాటు అవసరమైన అన్ని రకాల పోస్టులు మంజూరైన పోస్టుల్లో ఉన్నాయి. సిబ్బంది సరిపడా మంజూరు కావడంతోపాటు వీరు ఇక వేతనాలను నేరుగా మున్సిపల్ పరిపాలనా శాఖనుంచి డ్రా చేసుకునే సదుపాయం లభించింది. దీంతో ఉత్తుత్తి మున్సిపాలిటీ దుస్థితినుంచి నిజమైన మున్సిపాలిటీగా సరికొత్త రూపాన్ని కుప్పం మున్సిపాలిటీ సంతరించుకుంది. కోట్లాది రూపాయలతో ప్రతిపాదించిన అభివృద్ధి పనుల్లో వేగం పెరిగి నూతన శకం దిశగా కుప్పం మున్సిపాలిటీ నిశ్చయంగా అడుగులు వేస్తుందని ప్రజలు ఆశిస్తున్నారు. కొత్తగా మంజూరైన పోస్టులన్నీ ఈ నెలాఖరులోగా భర్తీ అయ్యే అవకాశం ఉన్నదని మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు తెలిపారు. దీంతో మున్సిపల్ పాలన మరింత సమర్థంగా, ముఖ్యమంత్రి ఆశయాలకు అనుగుణంగా నిర్వహించగలమన్న ఆశాభావం ఆయన వ్యక్తం చేశారు.

కిడ్నీ బాధితుడికి రూ.10వేల ఆర్థిక సాయం



బాధితుడికి రూ.10వేలను అందిస్తున్న పార్థసారథినాయుడు

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): సాంబయ్యకండ్రిగ ప్రాంతానికి చెందిన కిడ్నీ బాధితుడు షణ్ముగం వైద్య ఖర్చులకు చిత్తూరుకు చెందిన మాజీ కౌన్సిలర్ పార్థసారథి నాయుడు రూ.10వేల ఆర్థిక సాయం అందించారు. షణ్ముగం తన రెండు కిడ్నీలు పాడై కుటుంబాన్ని పోషించలేక ఇబ్బందులు పడుతున్నాడు. ఈ విషయాన్ని 'ప్రాణభిక్ష పెట్టండి' అనే శీర్షికన మంగళవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. స్పందించిన ఆయన బాధితుడి ఇంటికి వెళ్లి నగదు అందించారు.

ఆర్టీసీలో పలు పనులకు టెండర్ల ఆహ్వానం

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఆర్టీసీ డిపోల్లో పలు పనులకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు డీపీటీవో జగదీష్ తెలిపారు. చిత్తూరు-2 డిపోలోని బెంగళూరు, కుప్పం ప్లాట్‌ఫాంలో టాయిలెట్లు నిర్వహణకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే వి.కోట, పుంగనూరు బస్టాండ్‌లో టాయిలెట్ల నిర్వహణకు, బస్టాండ్ శుభ్రం చేయడానికి ఎటువంటి కాంట్రాక్టు లేకుండా పనిచేసేందుకు ఇద్దరు కావాలన్నారు. చిత్తూరు-2 డిపోలో ఏసీ బస్సులు శుభ్రం చేయడానికి, కర్టన్లు మార్చడానికి, చిత్తూరు-2 డిపో, పలమనేరు, కుప్పం, వి.కోట బస్టాండ్‌లో పర్సనల్ వేయింగ్ మిషన్లు ఏర్పాటుకు టెండర్లు పిలిచినట్లు వివరించారు. కుప్పం, చిత్తూరు-1 డిపోల్లో హెచ్ఎస్‌డీ ఆయిల్ నింపేందుకు, ఆయిల్‌కు సంబంధించిన విషయాలను కంప్యూటర్‌లో నమోదుకు ఏడుగురు కావాలని టెండరు ద్వారా ఆహ్వానించడం జరిగిందన్నారు. ఇతర వివరాలకు సంబంధిత డిపోలో సంప్రదించాలని సూచించారు.

వరసిద్ధుడి ఆలయ హుండీ ఆదాయం రూ.1.34 కోట్లు



ఈవో పర్యవేక్షణలో హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

ఐరాల(కాణిపాకం), ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.1,34,68,278 లభించింది. మంగళవారం స్వామి కానుకలను ఆలయ ఆస్థాన మండపంలో ఈవో పెంచలకిషోర్ పర్యవేక్షణలో సిబ్బంది లెక్కించారు. ఈ ఆదాయంలో 44 గ్రాముల బంగారు, ఒక కిలో ఐదు గ్రాముల వెండితోపాటు 183 యూఎస్ఏ, 20 ఆస్ట్రేలియా, 15 కెనడా డాలర్లు, 355 యూఏఈ దిర్హామ్స్, 70 ఇంగ్లాండ్ పౌండ్లు, 25 యూరోలు, 367 మలేసియా రింగిట్స్ లభించాయి. గోసంరక్షణ హుండీ ద్వారా రూ.9,687, నిత్యాన్నదానం హుండీ ద్వారా రూ.45,694, ప్రచార రథం ద్వారా రూ.5,318 సమకూరాయి. ఆలయానికి ఈ ఆదాయం 21 రోజుల్లో లభించినట్లు ఈవో తెలియజేశారు. ఈ లెక్కింపులో ఏఈవోలు రవీంద్రబాబు, హరిమాధవరెడ్డి, ధనంజయ, ప్రసాద్, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, బాలరంగస్వామి, సీఎ్‌ఫవో నాగేశ్వరరావు, హుండీ ఇన్‌స్పెక్టర్ సుబ్రహ్మణ్యం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పురందేశ్వరిపై మిథున్ వ్యంగ్యాస్త్రాలా?

బీజేపీ శ్రేణుల మండిపాటు



చిత్తూరు సెంట్రల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరిని ఉద్దేశించి రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి వ్యంగ్యంగా మాట్లాడటం సరికాదని జిల్లా బీజేపీ శ్రేణులు మండిపడ్డాయి. మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయంలో పలువురు మీడియాతో మాట్లాడారు. జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర్‌నాయుడు మాట్లాడుతూ.. అటవీ సంపదలే కాకుండా ఎన్నో అవినీతి అక్రమాలకు పాల్పడిన మిథున్‌రెడ్డి.. ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, పురందేశ్వరిపై విమర్శలు చేయడం సరికాదన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, నాయకులు బాబు, రవికుమార్, చిట్టిబాబు, మోహన్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

'సింగిల్ ఫేస్' వాడటం వల్లే ప్రమాదం

ట్రాన్స్‌కో ఏడీఈ అరుణ్‌నాథ్

ఐరాల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఐరాల తహసీల్దార్,ఎంపీడీవో కార్యాలయాలకు త్రీ ఫేస్ కరెంటు ఉన్నా.. సింగిల్ ఫేస్ వాడటం వల్లే ప్రమాదం జరిగిందని ఐరాల ట్రాన్స్‌కో ఏడీఈ అరుణ్‌నాథ్ అన్నారు. మంగళవారం తన సిబ్బందితో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రమాదవశాత్తూ ఓ తొండ విద్యుత్ తీగలపై పడినప్పుడు కార్యాలయాల్లోని ఎంసీబీ వెంటనే ట్రిప్ అయ్యి ఉంటే ప్రమాదం జరిగేది కాదన్నారు. అలాగే రెండు కార్యాలయాలకు ఒకే మీటరు ద్వారా కరెంటు వాడటం కూడా సరికాదన్నారు. ఇక ఈ కార్యాలయాల్లోని విద్యుత్ వైర్లు చాలా నాసిరకంగా ఉన్నాయని చెప్పారు. అధికారులు వెంటనే ఎంసీబీలను, వైర్లను పూర్తిగా మార్చుకుంటే బాగుంటుందన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో మాత్రం విద్యుత్ సరఫరాను ట్రాన్స్‌కో అధికారులు పునరుద్ధరించారు. ఎంపీడీవో కార్యాలయంలో మాత్రం బుధవారం నాటికి పునరుద్ధరిస్తామని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐరాల ట్రాన్స్‌కో ఏఈ నీరజ, సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ నాయకుడి దాష్టీకం

తాను ఆక్రమించుకున్న కుంటపై ఫిర్యాదు చేశారని గ్రామానికెళ్లే రోడ్డును రెండు చోట్ల తవ్వేశాడు

వైసీపీ నాయకుడొకరు గ్రామంలోని ఓ కుంటను ఆక్రమించుకున్నాడని రెవెన్యూ అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేశారు. విచారించడానికి మంగళవారం రెవెన్యూ అధికారులు వచ్చారు. ఆక్రమణలను గుర్తించి, కుంట విస్తీర్ణం వరకు ట్రెంచ్ కొట్టారు. దీన్ని జీర్ణించుకోని ఆ వైసీపీ నాయకుడు గ్రామానికి వెళ్లే రోడ్డును రెండుచోట్ల తవ్వేసి.. రాకపోకలకు ఇబ్బంది కల్గించాడు.



బాలుపల్లెకు వెళ్లే రోడ్డును రెండు చోట్ల ఇలా తవ్వేశారు

వెదురుకుప్పం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఆ ఊరికి ఎలా వెళ్తారో చూస్తా.. అంటూ వైసీపీ నాయకుడు, అతని అనుచరులు రోడ్డును రెండు చోట్ల తవ్వేసిన సంఘటన మంగళవారం సాయంత్రం వెదురుకుప్పం మండలంలో జరిగింది. బాలుపల్లె సమీపంలో ఉన్న బత్తిరెడ్డికుంటను వైసీపీ నాయకుడు ఆక్రమించుకుని సాగు చేశాడు. దీనిపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. దాంతో ఆ గ్రామానికి మంగళవారం రెవెన్యూ ఉద్యోగులు వెళ్లడంతో జీర్ణించుకోలేని వైసీపీ నాయకుడు, అతని అనుచరులు ఎక్స్‌కవేటర్ సాయంతో బాలుపల్లెకి వెళ్లే రోడ్డులో పూల కృష్ణారెడ్డి పొలం సమీపంలో, పశువుల మేతకు వెళ్లే మార్గంలో రెండుచోట్ల రోడ్డుతవ్వేసిను రాకపోకలకు ఇబ్బంది కల్గించాడు.

ట్రెంచ్ కొట్టిన రెవెన్యూ

బాలుపల్లె సమీపంలో బత్తిరెడ్డికుంట ఆక్రమణలను గుర్తించి, కుంట విస్తీర్ణం వరకు మంగళవారం రెవెన్యూ ఉద్యోగులు ట్రెంచ్ కొట్టినట్లు గ్రామస్తులు తెలిపారు.

ఆక్రమణదారుడిపై తగిన చర్యలేవీ?

ఆక్రమణదారుడిపై తగిన చర్యలు తీసుకోవాల్సిన అధికార యంత్రాంగం మీనమేషాలు లెక్కించడం వల్లనే గ్రామాల్లో గొడవలకు కారణమవుతున్నట్లు బాలుపల్లె గ్రామస్తులు ఆరోపించారు. క్రిమినల్ కేసు నమోదు చేసి, దుక్కుకు ఉపయోగించిన ట్రాక్టర్లను సీజ్ చేసి ఉంటే భయపడేవారని అంటున్నారు. అలాంటి చర్యలు తీసుకోకపోవడం వల్లే బరి తెగించి రోడ్డును రెండు చోట్ల తవ్వేశారని తెలిపారు. రోడ్డు తవ్విన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, ఎక్స్‌కవేర్‌ను సీజ్ చేయకపోతే ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని గ్రామస్తులు మంగళవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు.

మా భూముల కబ్జాకు పెద్దిరెడ్డి అనుచరుడి యత్నం

ఇ.రామిరెడ్డిగారిపల్లెవాసుల ఆరోపణ



మాట్లాడుతున్న సుబ్బిరామ నాయుడు

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి పెద్దిరెడ్డి అనుచరుడు మధుసూదన్‌రెడ్డి తమ భూములను కబ్జా చేయడానికి యత్నిస్తున్నాడని పులిచెర్ల మండలం ఇ.రామిరెడ్డిగారిపల్లెకు చెందిన సుబ్బిరామ నాయుడు, ఆయన కుమార్తె కృష్ణకుమారి ఆరోపించారు. మంగళవారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో వారు మీడియాతో మాట్లాడారు. తనకు గ్రామంలో 4.75 ఎకరాలు, తన కుమార్తెకు ఐదు ఎకరాల భూమి ఉందన్నారు. ఈ భూమిలో 40 ఏళ్లుగా మామిడి చెట్లు సాగుచేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని చెప్పారు. గత నెల మధుసూదన్ రెడ్డి అనుచరులు ఎక్స్‌కవేటర్లు తీసుకొచ్చి మామిడి చెట్లను తొలగించారని చెప్పారు. సోమవారం రాత్రి తమ ఇంటికి నిప్పు పెట్టారని వాపోయారు. మధుసూదన్ రెడ్డి వల్ల తమ కుటుంబానికి ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని కోరారు. అలాగే తమ భూమిని కబ్జాదారుడి నుంచి కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

ప్రతి ఇంటినీ ఓ పవర్ జనరేటర్‌గా మార్చుకోవచ్చు

పీఎం సూర్య ఘర్ కింద ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా సోలార్ ప్యానళ్లు - ఇతరులకు రూ.78వేల వరకు సబ్సిడీ : ఈఈ



సమావేశంలో ప్రసంగిస్తున్న ఈఈ మునిచంద్ర

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి11(ఆంధ్రజ్యోతి): పీఎం సూర్య ఘర్ పథకం కింద ప్రతి ఇంటినీ ఓ పవర్ జనరేటర్‌గా మార్చుకోవచ్చని చిత్తూరు ఆపరేషన్ డివిజన్ ఈఈ మునిచంద్ర తెలిపారు. మంగళవారం తన కార్యాలయంలో డివిజన్‌లోని అధికారులతో సమీక్షించారు. ఈ పథకం కింద ఎస్సీ, ఎస్టీలకు సోలార్ ప్యానళ్లను ఉచితంగా ఇస్తారన్నారు. వీటిని అమర్చుకున్న వారికి ప్రతి నెలా రూ.200లను ప్రభుత్వం వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తుందన్నారు. దీనిపై ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని చెప్పారు. అలాగే 200 యూనిట్లు కన్నా అధికంగా కొందరు ఎస్సీ, ఎస్టీలు వినియోగిస్తున్నారని, అటువంటివారు పూర్తి బిల్లును చెల్లించాల్సి వస్తుందని కూడా తెలియజేయాలన్నారు. ఇక ఇతరులకు (నాన్ ఎస్సీ, ఎస్టీలకు) సోలార్ పానళ్లు ఏర్పాటు చేసుకుంటే కేంద్ర ప్రభుత్వం రూ.78వేల వరకు రాయితీ ఇస్తుందన్నారు. మూడు కిలోవాట్ సామర్థ్యం కలిగిన సోలార్ ప్యానళ్ల ఏర్పాటు చేసుకుంటే సుమారు రూ.2.05లక్షలు ఖర్చవుతుందని, ఇందులో ప్రభుత్వం రూ.78వేలను సబ్సిడీగా ఇస్తుందని చెప్పారు. అవసరమైన వారు బ్యాంకుల ద్వారా లోను తీసుకోవచ్చన్నారు. ఒక్కసారి ఏర్పాటు చేసుకుంటే 25ఏళ్ల వరకు మెయింటనెన్స్ ఉండదన్నారు. మూడు కిలోవాట్ ఏర్పాటు చేసుకుంటే సుమారు 300 నుంచి 350 యూనిట్ల వరకు బిల్లు ఆదా అవుతుందని తెలియజేశారు.

ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోండి

ఎక్కడా విద్యుత్ ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఈఈ సూచించారు. గత ఏడాది ఆక్సిడెంట్ ఫ్రీ అవార్డును గెలుపొందామని గుర్తుచేశారు. డివిజన్ పరిధిలో సుమారు 400 వర్క్ ఆర్డర్లు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని ఈ నెలలోపు పూర్తి చేయాలన్నారు. లేదంటే సంబంధిత ఏఈపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ట్రాన్స్‌ఫార్మర్లు ఫెయిల్యూర్ లేకుండా చూసుకోవాలన్నారు. సమావేశంలో డీఈలు ఆనంద్, ప్రసాద్, శేషాద్రి, ఏఈలు పాల్గొన్నారు.

త్రిశూల స్నానానికి సర్వం సిద్ధం



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయం పక్కనే ఉన్న స్వర్ణముఖి నదిలో త్రిశూల స్నానం నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశారు. మహాశివరాత్రి ఉత్సవాలకు ముందు మాఘపూర్ణిమ పురస్కరించుకుని త్రిశూల స్నాన ఉత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీ. ఈనేపథ్యంలో ఆలయంలో బుధవారం ఉదయం 9గంటలకు పంచ ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం ఆలయం నుంచి స్వర్ణముఖి నదిలోని సద్యోముక్తి ప్రదేశం వరకు ఊరేగింపుగా ఉత్సవమూర్తులు సాగుతారు. నదిలో సద్యోముక్తి పురాణ ప్రవచనం అనంతరం త్రిశూల స్నాన ఘట్టాన్ని శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. త్రిశూల స్నానం జరిగే సమయంలో భక్తులు పుణ్యస్నానం అచరించేందుకు పెద్దఎత్తున తరలి రానున్నారు.

ఎవరు కన్న బిడ్డో..?

- శిశువుతో చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చిన మహిళ
- మృతి చెందిందని తెలియడంతో పరారీకి యత్నం
- అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం ఇచ్చిన సెక్యూరిటీ
- మహిళను విచారిస్తున్న పోలీసులు

చిత్తూరురూరల్,ఫిబ్రవరి11(ఆంధ్రజ్యోతి): చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి మంగళవారం తెల్లవారు జామున రెండు గంటల సమయంలో ఓ మహిళ పురిటి బిడ్డను తీసుకొచ్చింది. బిడ్డకు అనారోగ్యంగా ఉందని వైద్యులను సంప్రదించింది. వైద్యులు పరీక్షించి.. ఆ బిడ్డ మృతి చెందిందని నిర్ధారించారు. బిడ్డ తల్లి ఎక్కడని వైద్యులు ఆరా తీయగా అసలు విషయం బయటపడింది. ప్రైవేటు ఆస్పత్రిలో డెలివరీ అయిందని, అక్కడ తమ వల్ల కాదని బిడ్డను వేరే ఆస్పత్రికి తీసుకెళ్లాలని చెప్పడంతో తాను ఇక్కడికి తీసుకొచ్చానని సమాధానం చెప్పింది. మరిన్ని వివరాల కోసం ఓపీ తేవాలని వైద్యులు ఆమెకు సూచించారు. అయితే ఆమె హడావుడిగా ఆటో ఎక్కి పరారయ్యేందుకు యత్నించింది. అనుమానం వచ్చిన ఆస్పత్రి సెక్యూరిటీ ఆటోను వెంబడించి మహిళను అడ్డుకుని ప్రశ్నించగా పొంతనలేని సమాధానం చెప్పడంతో వారు టూటౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. బిడ్డను ఆస్పత్రిలోనే ఉంచి, మహిళను పోలీస్‌స్టేషన్ తీసుకెళ్లి విచారిస్తున్నారు. ఆమెను చిత్తూరు నగరంలోని సంతపేటవాసిగా గుర్తించినట్లు సమాచారం.

ఉదయం నుంచి విచారణ కొనసాగుతూనే ఉందా?

ఉదయం నుంచి ప్రారంభమైన పోలీసుల విచారణ రాత్రయినా పూర్తి కాలేదు. టూటౌన్ పోలీసులను వివరణ కోరగా.. ఇంకా విచారణ చేస్తున్నామని చెప్పారు. ఆ బిడ్డ ఎవరు కన్న బిడ్డ? ఆ బిడ్డ ఆ మహిళకు ఏమవుతుంది? ఎక్కడైనా అపహరించిందా? అనే అనుమానాలు తలెత్తుతున్నాయి. ఈ ఘటనపై వివిధ కథనాలు సోషల్ మీడియాలో చెక్కర్లు కొడుతున్నాయి.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కుప్పం అర్బన్‌కు ఇద్దరు ఎస్‌ఐలు


ఎస్‌ఐ బాబు

కుప్పం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కుప్పం అర్బన్ సర్కిల్‌కు ఇద్దరు ఎస్‌ఐలను నియమిస్తూ జిల్లా ఎస్పీ మణికంఠ ఉత్తర్వులు జారీ చేశారు. వి.కోట నుంచి ఇ.బాబు, చిత్తూరు నుంచి వై.రామకృష్ణలను కుప్పం అర్బన్ సర్కిల్‌లో నియమించారు. కుప్పం అర్బన్ సర్కిల్‌లో ఎస్‌ఐల పోస్టులు ఖాళీగా ఉన్న అంశంపై ఈనెల 6వ తేదీన 'ఆంధ్రజ్యోతి'లో 'ఎస్‌ఐలు కావలెను' అన్న శీర్షికన వార్తా కథనం ప్రచురితమైంది. కుప్పం మున్సిపాలిటీతోపాటు మొత్తం మండలం అర్బన్ సర్కిల్ పరిధిలోకి వస్తుంది. ఇక్కడ ట్రాఫిక్ సమస్యతోపాటు గంజాయి, నాటుసారా వంటి సమస్యలున్నాయి. ప్రొటోకాల్ డ్యూటీ అదనం. ఎస్‌ఐలు లేకపోవడంతో ఉన్న ఒకేఒక సీఐ పి.శంకరయ్య మాత్రమే అంతంతమాత్రపు సిబ్బందితో నెట్టుకొస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి స్పందించిన జిల్లా ఎస్పీ ఖాళీగా ఉన్న ఎస్‌ఐ పోస్టులను భర్తీ చేస్తూ ఉత్తర్వులు విడుదల చేశారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో కేఈసీ విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న సునీల్ రాజ్ తదితరులు

కుప్పం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): హైదరాబాదులో ఈనెల 8వ తేదీన అగస్త్య ఇంటర్నేషనల్, శాంసంగ్‌లు సంయుక్తంగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో కుప్పం ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరచి బహుమతులు గెలుచుకున్నారు. కేఈసీలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ విభాగంలో మూడో సంవత్సరం చదువుతున్న అబ్దుల్ తౌహిద్, ఎస్‌కే ఎం.అరుణ్ కుమార్ 'బ్లేడ్ టెక్ ఇన్నోవేషన్' అనే అంశంపై తయారు చేసిన ప్రాజెక్ట్ నాలుగో బహుమతికి ఎంపికై అవార్డుతోపాటు రూ.15 వేలు రివార్డు గెలుచుకుంది. అలాగే వి.పావన, ఎస్.శోభ 'వేస్ట్ వర్త్' అనే అంశంపై తయారు చేసిన ప్రాజెక్టు ప్రత్యేక ప్రోత్సాహక బహుమతి అందుకుని రూ.5 వేలు నగదు బహుమతి అందుకున్నారు. రాష్ట్ర స్థాయి బహుమతులు పొందిన విద్యార్థులు బెంగళూరులో నిర్వహించబోయే జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించారు. బీసీఎస్ విద్యా సంస్థల చైర్మన్ బీసీ నాగరాజ్, కేఈసీ వైస్ చైర్మన్ డాక్టర్ సునీల్ రాజ్, సెక్రటరీ సాగర్ రాజ్, ప్రిన్సిపాల్ ఎస్.సుధాకర్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.భాస్కరన్, కె.లోగేశ్, జ్ఞానమూర్తి, రవీంద్రకుమార్ అభినందించారు.

మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా పనిచేయాలి


అమినిగుంట అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి నరేంద్రకుమార్

చౌడేపల్లె, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని మండల ప్రత్యేకాధికారి నరేంద్రకుమార్ సూచించారు. మంగళవారం ఆయన మండలంలోని అమినిగుంట, గడ్డంవారిపల్లె, తెళ్లనీళ్లపల్లె, నాయునివారిపాళ్యం ఎంపీపీ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పీహెచ్‌సీ, బీసీ, ఎస్సీ బాలుర, బాలికల వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలలో మరుగుదొడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో లీలామాధవి, ఎంఈవో కేశవరెడ్డి, ఏఈ చందన, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

సోలార్ పవర్‌ప్లాంట్‌కు స్థల పరిశీలన


సోలార్ పవర్ ప్లాంట్ కోసం స్థల పరిశీలన చేస్తున్న అధికారులు

చౌడేపల్లె, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటు కోసం షికారిపాళ్యం సమీపంలో మంగళవారం అధికారులు స్థల పరిశీలన చేశారు. మండలానికి 5 మెగా వాట్ల సోలార్ పవర్ ప్లాంట్ మంజూరైనట్లు తెలిపారు. తహసీల్దార్ హనుమంతు, టీడీపీ మండలాధ్యక్షులు రమేష్‌రెడ్డి, ట్రాన్స్‌కో ఏఈ శశిధర్, సర్వేయర్ గుణశేఖర్, సబ్ ఇంజినీర్ సంతోష్‌కుమార్, టీడీపీ నాయకులు గణపతి, రమణ తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్లలో నాణ్యమైన భోజనం


అన్న క్యాంటీన్‌ను తనిఖీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి

పుంగనూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): అన్న క్యాంటీన్లలో నాణ్యమైన భోజనం అందిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం పుంగనూరులోని మదనపల్లె మార్గంలోని అన్న క్యాంటీన్‌ను మున్సిపల్ కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. భోజనాన్ని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట మున్సిపల్ డీఈఈ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలు

పెరిగేలా చర్యలు తీసుకోవాలి

● జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు



పుంగనూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని విద్యా ప్రమాణాలు పెంచేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు కోరారు. తెలుగు మీడియం వద్దని చెప్పడం లేదని.. ఇంగ్లీషు మీడియం చదవడంతో ఇంటర్నేషనల్ పోటీ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించి రాష్ట్ర భవిష్యత్తును కాపాడుకోవడానికి అవకాశాలు ఉన్నట్లు తెలిపారు. మంగళవారం పుంగనూరు ఎంఈవో కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పాఠశాలలో 60 మందికి తక్కువ ఉన్న పాఠశాలలను రద్దు చేసి పక్క గ్రామాల పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించే విధంగా చర్యలు ప్రస్తుత ప్రభుత్వం తీసుకుంటున్నట్లు ఆయన ఆరోపించారు. రానున్న రోజుల్లో నీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడే అవకాశాలు ఉన్నట్లు తెలిపారు. ఆరునెలల పాటు హంద్రీ-నీవా కాలువతో నీటిని సరఫరా చేస్తే భూగర్భజలాలు పెరుగుతాయన్నారు. సమావేశంలో ఎంపీపీ భాస్కర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పండిట్ దీనదయాళ్‌కు నివాళులు


పండిట్ దీనదయాల్‌కు నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): పుంగనూరులో బీజేపీ నాయకులు పండిట్ దీనదయాళ్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ దేశానికి ఆయన అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు జగదీశ్వర్‌రాజు, జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు నరసింహులు, నాయకులు మల్లికారాణి, పెద్దమఠం బాబు, నానబాల కుమార్, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆప్టా క్యాలెండర్ల ఆవిష్కరణ


క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ఎంఈవోలు

పలమనేరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): పలమనేరు ఎమ్మార్సీ వద్ద మంగళవారం ఆప్టా ఉపాధ్యాయ సంఘం ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్లను ఎంఈవోలు లీలారాణి, బాలసుందరం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆప్టా మండల అధ్యక్షులు ఎస్. అన్సర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.మునాఫ్, మండల ఉపాధ్యాయులు మనోహర్, మహమ్మదుల్లాషా, సమీఉల్లాఖాన్, మహమ్మదాలి, దాదాపీర్, జరీనాబేగం, వెంకటప్ప, షాహిబాను, బషీరున్నీసాబేగం, రాసిదా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సల్లాపురమ్మకు విశేష అలంకరణ


పలమనేరు డీఎస్పీ ప్రభాకర్‌ను సన్మానించిన జాతర నిర్వాహకులు

సోమల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఎస్.వడ్డిపల్లె సమీప గుట్టపల్లెలో కొలువైన సల్లాపురమ్మ ఆలయంలో మంగళవారం జాతర సందర్భంగా అమ్మవారికి విశేష అలంకరణ చేశారు. భక్తులు పొంగళ్లు పెట్టి నైవేద్యం అందించారు. బుధవారం చాందినీబండ్ల ఊరేగింపు, ఆలయం వద్ద అమ్మవారికి అభిషేక పూజలు నిర్వహించనున్నారు. డీఎస్పీ ప్రభాకర్‌ను కలిసి జాతరకు ఆహ్వానించి సన్మానించారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ ఉమాపతి నాయుడు, మాజీ సర్పంచి బాలాజీ, పెద్దరెడ్డెప్ప, రెడ్డెప్ప, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

గజవాహనంపై


వేణుగోపాలస్వామి విహారం



వి.కోట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): వి.కోటలో రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఆరో రోజు మంగళవారం స్వామివారిని సుప్రభాత్ సంస్థ సీఈవో ఉదయసాగర్ రెడ్డి కుటుంబ సభ్యులు అభిషేకాల అనంతరం విశేషంగా అలంకరించారు. రాత్రి ఉత్సవ మూర్తులను గజవాహనంపై ఊరేగించారు. విశ్రాంత ఫార్మసిస్టు రామకోటి పిళ్లై కుటుంబ సభ్యులు, ఆలయ ధర్మకర్త సీతారామయ్య, కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం వేణుగోపాలస్వామి రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త తెలిపారు.

టీడీపీ ప్రభుత్వంతోనే మహిళా సంక్షేమం

● ఎమ్మెల్యే అమరనాథరెడ్డి


మహిళా సంఘాలకు నమూనా చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి


హాజరైన స్వయం సహాయక సంఘాల మహిళలు

పలమనేరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశ ప్రభుత్వ హయాంలోనే మహిళలు అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతున్నారని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అన్నారు. పలమనేరు ఎంపీడీవో కార్యాలయం వద్ద ఉన్న మహిళా సమాఖ్య భవనంలో మంగళవారం మండలంలోని గ్రూపు సభ్యులకు మెగా రుణ మేళా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నాడు ఎన్టీఆర్ మహిళలకు అండగా నిలుస్తూ ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు తీసుకొచ్చారని.. నేడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మహిళల అభివృద్ధికి పలు సంక్షేమ పథకాలను తీసుకొచ్చారన్నారు. నాడు చంద్రబాబు ఆలోచనలతో పుట్టిన డ్వాక్రా సంఘాలకు రుణాలు ఇచ్చేందుకు బ్యాంకులు ఎగబడతున్నాయని, మహిళలు బ్యాంకులకు కల్పించిన నమ్మకమే కారణమని తెలిపారు. పురుషులకు దీటుగా మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని కోరారు. ప్రభుత్వం, బ్యాంకులు అందిస్తున్న సహకారాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రతి ఇంట్లో ఒక మహిళా పారిశ్రామిక వేత్తను చూడాలన్నదే చంద్రబాబు ధ్యేయమని.. ఆ దిశగా మహిళలు రాణించాలన్నారు. అనంతరం మండలంలోని 47 మహిళా సంఘాల సభ్యులకు రూ.7.5 కోట్ల చెక్కును అందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఖాదర్‌బాషా, ఏపీఎం మొగిలీశ్వరయ్య, సీసీ హరి, విజయకుమారి, గురుమూర్తి, మండల పార్టీ అధ్యక్షులు నాగరాజరెడ్డి, ప్రధాన కార్యదర్శి గణేష్, టీడీపీ నాయకులు జగదీష్‌నాయుడు, మల్లీశ్వరరెడ్డి, వెంకటరత్నం, రామ్మూర్తినాయుడు, సెల్వరాజ్, మండల తెలుగు యువత అధ్యక్షులు వెంకటమునిరెడ్డి, స్వతంత్రబాబు, హరి, గిరి, శీను, జనసేన నాయకులు దిలీప్‌కుమార్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

పలమనేరు: పలమనేరు మండలంలోని అధికారులు, నాయకులు సమన్వయంతో పనిచేయాలని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి సూచించారు. మంగళవారం ఆయన పలమనేరు ఎంపీడీవో కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. గత 8 నెలలుగా ప్రభుత్వం తీసుకొచ్చిన అభివృద్ధి సంక్షేమ పథకాలు గ్రామీణ ప్రజలందరికీ అందేలా బాధ్యత తీసుకోవాలన్నారు. వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. తహసీల్దార్ ఇన్బనాథన్, ఎంపీడీవో ఖాదర్‌బాషా, అధికారులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం


పార్వతీపురంలో క్లోరినేషన్ యూనిట్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

సోమల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): తాగునీటి ట్యాంకుల పరిసరాల వద్ద పరిశుభ్రతకు ప్రాధాన్యత కల్పించాలని ఎంపీడీవో నారాయణ తెలిపారు. మంగళవారం ఇరికిపెంట పంచాయతీలోని పలు గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఓవర్ హెడ్ ట్యాంకుల వద్ద క్లోరినేషన్ యూనిట్ల ఏర్పాటును తనిఖీ చేశారు. చెత్తతో సంపద తయారీ చేపట్టాలని, పంచాయతీలకు ఆదాయ వనరులు పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ లక్ష్మీదేవి, సర్పంచి రెడ్డెప్ప, జేఈ అనూష, కార్యదర్శి మేనక తదితరులు పాల్గొన్నారు.

వెంకటరెడ్డితో అడవినాథునికుంటకు గుర్తింపు


సమావేశంలో మాట్లాడుతున్న విశ్రాంత ప్రొఫెసర్ గాంధీ వెంకటరెడ్డి

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): విశ్రాంత ప్రొఫెసర్ గాంధీ వెంకటరెడ్డితోనే అడవినాథునికుంటకు గుర్తింపు వచ్చినట్లు మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమా పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని మోడల్ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ మారుమూల గ్రామానికి మోడల్ స్కూల్, ఓపెన్ ఆడిటోరియం స్టేజ్, బస్సు సౌకర్యం, జాతీయ నాయకుల విగ్రహాలు వంటి వసతులను పాఠశాలల ఆవరణలో కల్పించిన ఘనత ఆయనకే దక్కుతుందని కొనియాడారు. అనంతరం ఆయన్ను శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముర్రుపాలు పిల్లలకు ఆరోగ్యకరం


సూచనలిస్తున్న డాక్టర్ దినేష్‌కుమార్ నాయక్

రొంపిచెర్ల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ముర్రుపాలు చిన్నపిల్లలకు ఆరోగ్యకరమని వైద్యాధికారి దినేష్‌కుమార్ నాయక్ తెలిపారు. మంగళవారం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. సురక్షితమైన ప్రసవం కోసం గర్భిణులు ప్రభుత్వాస్పత్రిలో కాన్పులు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విద్యాధికారి రాజేశ్వరి, సీహెచ్‌వో కాంతమ్మ, పీహెచ్ఎన్ పార్వతమ్మ, సూపర్‌వైజర్ పంకజాక్షి, ఆరోగ్యకార్యకర్తలు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన అవసరం


శిక్షణ ఇస్తున్న అగ్నిమాపకశాఖాధికారి సుబ్బరాజు

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు అగ్నిప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలని పుంగనూరు అగ్నిమాపక శాఖాధికారి సుబ్బరాజు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని అడవినాథునికుంటలోని ప్రభుత్వ పాఠశాలలో అగ్నిప్రమాదాలు జరిగిన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పురందేశ్వరిని విమర్శించడం సిగ్గుచేటు

పుంగనూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరిని విమర్శించడం సిగ్గుచేటని బీజేపీ రాష్ట్ర మైనార్టీ మోర్చా నాయకుడు అయూబ్‌ఖాన్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ అవినీతి, అక్రమాలకు మారుపేరుగా ఉన్న వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి ఎలాంటి మచ్చ లేని బీజేపీ నాయకురాలిని విమర్శించడం సరికాదన్నారు. వైసీపీ నాయకులు చేసిన అవినీతి అక్రమాలను బయట పెట్టారనే ఆలోచనలతో ఆమెపై వ్యంగ్యంగా మాట్లాడటం దారుణమన్నారు. పురందేశ్వరిని మాట్లాడే అర్హత లేదని హెచ్చరించారు.

అనుమానాస్పద స్థితిలో కూలీ మృతి


మృతి చెందిన హరీష్‌చందర్ పాండే

పలమనేరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): పలమనేరు సమీపంలో జరుగుతున్న ఆరులైన్ల రహదారి పనులు చేసేందుకు ఉత్తరప్రదేశ్ నుంచి వచ్చిన హరీష్‌చందర్‌పాండే (55) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఆరులైన్ల రహదారిలో పలమనేరు మున్సిపాలిటీ పరిధిలోని గొబ్బిళ్లకోటూరు నుంచి అపస్మారక స్థితికి చేరుకున్న హరీష్‌చందర్‌పాండేను కూలీలు పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తీసుకొచ్చారు. అయితే అప్పటికే అతడు మృతిచెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. మృతిపై అనుమానాలు వ్యక్తం చేయడంతో పలమనేరు పోలీసులు కేసు విచారిస్తున్నారు.

ఆటో బోల్తా పడి కూలీకి గాయాలు

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు- రాయలపేట మార్గంలోని అలసాపురం సమీపంలో రోడ్డుపై నడిచి వెళుతున్న కూలీలపైకి ఓ ఆటో అతివేగంగా దూసుకెళ్లడంతో ఓ కూలీ తీవ్రంగా గాయపడిన సంఘటన పుంగనూరు మండలంలో జరిగింది. వివరాలిలా.. అలసాపురానికి చెందిన కొందరు మహిళలు వ్యవసాయ కూలీ పనులకు రోడ్డు మార్గంలో నడిచి వెళుతుండగా రాయలపేట వైపు నుంచి పుంగనూరుకు వెళుతున్న ఆటో అతి వేగంగా కూలీలపైకి దూసుకెళ్లింది. ప్రమాదంలో కూలీ లక్ష్మీదేవి(54) తీవ్రంగా గాయపడింది. ఆమెను చికిత్స నిమిత్తం మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మహిళపై అత్యాచారయత్నం

బైరెడ్డిపల్లె, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లె పట్టణంలోని ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన ఓ మహిళపై మంగళవారం మధ్యాహ్నం అదే ప్రాంతానికి చెందిన నాగరాజు అత్యాచారానికి యత్నించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు బైరెడ్డిపల్లె ఎస్‌ఐ పరశురాముడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కూలీలకు ఉపాధి పనులు కల్పించాలి

సోమల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): జాబ్ కార్డు ఉన్న ప్రతిఒక్కరికీ ఉపాధి పనులు కల్పించాలని ఏపీడీ శ్రీనివాసులు కోరారు. మంగళవారం స్థానిక స్త్రీ శక్తి భవనంలో సిబ్బందితో ఆయన సమీక్షించారు. రైతుల నుంచి రాబోవు ఏడాదిలో చేపట్టే పనుల వివరాలు సేకరించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ప్రణాళికలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో దినకర్‌బాబు, జేఈ రెడ్డెప్ప పాల్గొన్నారు.

ఘర్షణ పడి ఇద్దరికి గాయాలు

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఘర్షణ పడి ఇద్దరు గాయపడిన సంఘటన పుంగనూరు మండలంలో మంగళవారం జరిగింది. చంద్రమాకులపల్లె పంచాయతీ కృష్ణాపురానికి చెందిన రామకృష్ణ తన పొలంలోకి మట్టి తరలిస్తుండగా పక్కనే కాపురం ఉన్న గణపతి ఇంటి వద్ద సంపుపై టిప్పర్ వెళుతుందని డ్రైవర్‌ను మందలించాడు. ఈక్రమంలోనే గణపతి కుమారుడు మహేశ్ తన స్నేహితుడు వెంకటరమణతో రామకృష్ణ కుటుంబ సభ్యులపై గొడవకు వెళ్లారు. ఘర్షణలో వెంకటరమణతోపాటు రామకృష్ణ కుటుంబ సభ్యులలైన శివకుమార్ గాయపడ్డారు. వీరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

జనం సమస్యలు తీర్చేందుకే 'జన నాయకుడు'

●ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం


టీడీపీ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న డా.సురేష్‌బాబు

రామకుప్పం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): జనం ఎదుర్కొంటున్న సమస్యలకు సత్వర పరిష్కారం చూపడమే జననాయకుడు పోర్టల్ లక్ష్యమని ఏపీఎస్ఆర్టీసీ వైస్‌చైర్మన్ పీఎస్‌మునిరత్నం, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.సురేష్‌బాబు, సీఎం పీఏ దుర్గాప్రసాద్ అన్నారు. మంగళవారం రామకుప్పంలో జరిగిన టీడీపీ మండల సర్వసభ్య సమావేశంలో వారు మాట్లాడుతూ సీఎంగా చంద్రబాబు రాష్ట్ర పరిపాలన వ్యవహారాల్లో తలమునకలై ఉంటారని, నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించడం తన బాధ్యతగా గుర్తెరిగి ఆయన కుప్పం పార్టీ కార్యాలయంలో జననాయకుడు పోర్టల్, గ్రీవెన్స్‌సెల్ ఏర్పాటు చేశారన్నారు. ప్రజలు నేరుగా అధికారులకు వినతులిస్తే సమస్యల పరిష్కారంలో జాప్యం జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. అదే పార్టీ కార్యాలయం నుంచి సంబంధిత అధికారులకు నివేదించడంతో సమస్యలు త్వరగా పరిష్కారమవుతాయన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను పార్టీ శ్రేణులు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. సమావేశంలో టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పత్ర నారాయణాచారి, పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, మాజీ ఎంపీపీ ఆంజనేయరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ చిన్నికృష్ణ, తెలుగు రైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ సీతాపతి, తెలుగు యువత మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విశ్వనాథ్, వెంకటాచలం, నేతలు మనోహర్, నందారెడ్డి, సలాంసాబ్, మనోహర్, కామరాజనాయక్, గజేంద్ర, నాగభూషణం, కొళ్లపల్లెబాబు, టీవీ రవి, వెంకటరమణ, విజయ్‌కుమార్‌రెడ్డి, ఆదిల్, శ్రీనాథరెడ్డి, బాలరాజు, సుబ్రీ, మురళీమోహన్, నవీన్, జేయి, భూపతి, రామలింగారెడ్డి, జ్ఞానశేఖర్‌రెడ్డి, నాగరాజు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపక్షంలోనే ఉన్నట్టుంది

ఎన్నికల్లో టీడీపీ ఘనవిజయం సాధించి అధికారంలోకి వచ్చినా ఇప్పటికీ తాము ప్రతిపక్షంలోనే ఉన్నామని పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పత్ర నారాయణాచారి, ఎస్సీసెల్ జిల్లా కార్యదర్శి జయశంకర్‌తోపాటు పలువురు నేతలు, కార్యకర్తలు తమ ఆవేదన వ్యక్తం చేశారు. ఐదేళ్లు వైసీపీతో పోరాడామని.. వైసీపీ ప్రజావ్యతిరేక పాలనను ఎండగడుతూ ఆందోళనలు చేపడితే తట్టుకోలేక అప్పటి పాలకులు అక్రమంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, హత్యాయత్నం కేసులు నమోదు చేసి తమను జైళ్లకు పంపారన్నారు. గ్రామాల్లో సమస్యలపై పెట్టుకున్న అర్జీల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వాపోయారు. సమస్యలపై అధికారులకు ఫోన్ చేసినా స్పందించడం లేదని వాపోయారు. వైసీపీ ప్రభుత్వం తమపై పెట్టిన అక్రమ కేసుల నుంచి విముక్తి కల్పించాలన్నారు. ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం, మండలాధ్యక్షులు మాట్లాడుతూ అధికారులు, నాయకులు సమన్వయంతో పని చేస్తేనే ప్రజలు పార్టీని ఆదరిస్తారన్నారు. త్వరలోనే అధికారులు, పార్టీ ముఖ్యులతో సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు.

చిత్తూరు

జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

ఇష్టానుసారంగా ఇసుక తరలింపు

- అధికారుల సూచనలు బేఖాతరు



తెరణి వద్ద కుశస్థలి నదిలో వేకువ జామునే ఇసుక ట్రాక్టర్ల సందడి

నగరి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఇసుక రవాణా విషయంలో అధికారులు పలుసార్లు వాహనాలు పట్టుకుని అపరాధం విధించినా రవాణాదారుల తీరు మారలేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ఇటీవలే నగరి డీఎస్పీ అజీజ్ ఇసుక రవాణా చేసే వాహనదారులతో సమావేశం నిర్వహించి, కొన్ని ఆంక్షలు విధించారు. పగటిపూట మాత్రమే ఇసుక తీసుకోవాలని, ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకే కుశస్థలి నదిలో ఇసుక తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పనులకు, గృహనిర్మాణాలకు మాత్రమే నిర్దేశించిన సమయంలో ఇసుకను రవాణా చేసుకోవాలని చెప్పారు. కానీ రాత్రివేళల్లో సైతం ఇసుకను తరలిస్తున్నారని, వేకువ జామునే నదిలో ఇసుక ట్రాక్టర్లు ఉంటున్నాయని తెరణివాసులు వాపోతున్నారు.

ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో స్టాఫ్ నర్సుల కొరత



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నర్సులు

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో స్టాఫ్‌నర్సుల కొరత తీవ్రంగా ఉందని రాష్ట్ర ప్రభుత్వ నర్సుల సంఘం ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆరోగ్యశ్రీ పథకానికి సంబంధించిన పనులను స్టాఫ్ నర్సులకు బదులు తాము చేస్తున్నామని చెప్పారు. జిల్లా నర్సుల సంఘం అధ్యక్షురాలు రాధమ్మ, ఉపాధ్యక్షురాలు ఎస్.రాణి, కార్యదర్శి లీలావతి, కోశాధికారి సుభాషిణి, ఈసీ సభ్యులు శివమ్మ, హిమబిందు, ప్రియ తదితరులు పాల్గొన్నారు.

చెత్త సేకరణ కేంద్రాలను పరిశీలించిన డీపీవో

పెనుమూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కలవగుంట, శాతంబాకంలోని చెత్త సేకరణ కేంద్రాలను డీపీవో సుధాకర్‌రావు మంగళవారం పరిశీలించారు. తడి, పొడి చెత్తలను వేర్వేరుగా సేకరించాలని చెప్పారు. వీటిద్వారా సంపద సృష్టించడంపై దృష్టి పెట్టాలన్నారు. ఇందుకోసం గ్రీన్ అంబాసిడర్లతో పనులు చేయించాలని, ప్రతి కేంద్రాన్నీ నందనవనంగా తీర్చిదిద్దాలని సూచించారు. ఈవోపీఆర్డీ మహేశ్వర్‌రెడ్డి, సెక్రటరీలు శేషు, శ్రీనివాసులు పాల్గొన్నారు.



సిబ్బందికి సూచనలిస్తున్న డీపీవో సుధాకర్‌రావు

మెము రైలును పుత్తూరు వరకు పొడిగించండి

నగరి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మెము రైలును పుత్తూరు వరకు పొడిగించాలని స్టేషన్ కన్సల్టేటివ్ సభ్యులు కోరారు. ఏకాంబరకుప్పం రైల్వేస్టేషన్ ఆవరణలో మంగళవారం జరిగిన సమావేశంలో సభ్యులు స్థానిక సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. రైలు నెంబర్లు 22159, 22160, 12163, 12164 లను ఏకాంబరకుప్పం వద్ద ఆపాలని, ఎల్‌సీ49 వద్ద ఫ్లైఓవర్ నిర్మించాలని, చెన్నై-తిరుపతి మార్గంలో ప్రయాణించే రైలు నెంబరు 66021, 66022లను పునరుద్ధరించాలని, ఏకాంబరకుప్పం దళితవాడ రోడ్డులో ఇండియన్ బ్యాంకు సమీపాన సబ్‌వే నిర్మించాని కోరారు. ఈ మేరకు స్టేషన్ అధికారి దక్షిణమధ్య రైల్వే అధికారులకు సమాచారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో పొన్నప్పన్, శ్రీనివాసన్, బాలకృష్ణ, రాజమహేశ్వరన్, వినయ్‌కుమార్, సురేష్, అఖిల్ పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న సభ్యులు

అభివృద్ధి పనులను అడ్డుకుంటారా?: తెలుగు యువత

వెదురుకుప్పం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): దాతల దాతృత్వంతో అభివృద్ధి పనులు చేస్తుంటే వైసీపీ నేత, సర్పంచ్ దివ్య పనులను అడ్డుకోవడం దురదృష్టకరమని తెలుగు యువత కార్వేటినగరం మండల ప్రధానకార్యదర్శి ఢిల్లీబాబురెడ్డి ధ్వజమెత్తారు. మంగళవారం కార్వేటినగరం మండలం ఆర్కేవీబీపేట సమీపంలో అభివృద్ధి పనులను అడ్డుకున్న చోట మీడియాతో మాట్లాడారు. శ్మశాన వాటిక వద్ద నెలవాయి చెంగారెడ్డి దాతృత్వంతో రూ.5లక్షలతో స్నానపు గదులు, నీటి సదుపాయానికి ట్యాంకు నిర్మాణ పనులను చేపట్టినట్లు తెలిపారు. ఈ అభివృద్ధిని సహించలేని సర్పంచ్ అడ్డుకున్నారని ఆరోపించారు. అభివృద్ధి పనులు సజావుగా జరిగేలా యంత్రాంగం చర్యలు చేపట్టాలన్నారు.



పనులను అడ్డుకున్న చోట ఢిల్లీబాబురెడ్డి

భక్తిశ్రద్ధలతో తైపూస పూజలు

చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): గిరింపేట వళ్లీ సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో మంగళవారం పుష్యమి నక్షత్రం సందర్భంగా స్వామివారికి తైపూస పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కాళభైరవ ట్రస్టు ఆధ్వర్యంలో భక్తులు.. 108 బిందెల పాలు, సుగంధ ద్రవ్యాల మిశ్రమాన్ని తీసుకొచ్చి స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు, పూజలు చేశారు. భక్తులకు ట్రస్టు నిర్వాహకుడు వెంకటేషన్‌లు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయ ఈవో సుబ్బారెడ్డి, అగస్తీశ్వరాలయ అర్చకులు శివకుమార్, సామాజిక కార్యకర్త పార్థసారథి నాయుడు, పూల సుబ్రహ్మణ్యం నాయుడు తదితరులు పాల్గొన్నారు.



పాల బిందెలతో ఊరేగింపుగా వస్తున్న భక్తులు

పెండింగ్ బకాయిలు వసూలు చేయండి

పెనుమూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ బకాయిలను వసూలు చేయాలని సిబ్బందిని జీడీనెల్లూరు విద్యుత్ డీఈఈ శేషాద్రిరెడ్డి ఆదేశించారు. మంగళవారం పెనుమూరు సబ్‌స్టేషన్‌లో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. వ్యవసాయం, గృహ వినియోగ అదనపు లోడు బకాయిలు దాదాపు రూ.50 లక్షలు ఉన్నాయని, వసూలుకు సిబ్బంది ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని చెప్పారు. వినియోగదారులకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలన్నారు. ఏఈ తులసిప్రసాద్ పాల్గొన్నారు.

కార్మికుడి మృతదేహం బంధువులకు అప్పగింత

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): చిత్తూరు రూరల్ మండలంలోని ఉయ్యాలచింత వద్ద జరుగుతున్న బెంగళూరు-చెన్నై రోడ్డు పనుల్లో భాగంగా జిలిటెన్ స్టిక్ పేలి నల్గొండ జిల్లాకు చెందిన కార్మికుడు ఆంజనేయులు మృతి చెందిన విషయం తెలిసిందే. చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం చేశాక ఆయన మృతదేహాన్ని మంగళవారం బంధువులకు అప్పగించారు. కేసు నమోదు చేసి తాలూకా పోలీసులు విచారణ చేస్తున్నారు.



తాగునీటి కొళాయిల వద్ద పరిస్థితి - దుర్గంధం నడుమ మరుగుదొడ్డి

వసతులెక్కడ?

తాగునీరు లేదు
మరుగుదొడ్డికెళ్లాలంటే భయపడుతున్న ప్రయాణికులు
ఆర్టీసీ బస్టాండులో ఇదీ పరిస్థితి

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు ఆర్టీసీ బస్టాండులో వసతులు సరిగా లేక ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. తాగునీరు అందుబాటులో లేదు. మరుగుదొడ్డికి వెళ్లాలంటే భయమేస్తోంది. నిర్వహణ సరిగా లేకపోవడంతో అంటురోగాలు వస్తాయోనని భయపడుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో వెళితే అధిక రుసుం వసూలు చేస్తున్నారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. అలాగే ఇక్కడున్న దుకాణాల్లోనూ ఎమ్మార్పీకంటే అధిక ధరలు తీసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోపక్క ప్లాట్‌ఫాంలోని ఫ్యాన్లు తిరగక ఉక్కపోతతో అల్లాడిపోతున్నారు. ప్రయాణికుల కాలక్షేపం కోసం ఏర్పాటు చేసిన టీవీలు కూడా పనిచేయడం లేదు. దివ్యాంగుల కోసం ఉండాల్సిన వీల్‌చైర్లు లేవు. ఇక్కడి కాలువల్లో మురుగు పేరుకుని దుర్గంధం వెదజల్లుతోంది. ఈ విషయాలపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ప్రయాణికులు అంటున్నారు.

వారంలోపు సమస్యలు పరిష్కరిస్తాం



మరుగుదొడ్ల మరమ్మతులు చేయిస్తాం. ప్రతి ప్లాట్‌ఫాంలో తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేస్తాం. దుకాణాల్లో వస్తువులను ఎమ్మార్పీకంటే అధిక ధరలకు విక్రయించినా, మరుగుదొడ్ల వినియోగం కోసం అధిక డబ్బులు వసూలు చేసినా సంబంధిత కాంట్రాక్టు రద్దు చేస్తాం. వారంలోపు సమస్యలు పరిష్కరిస్తాం.
- జగదీష్, డీపీటీవో

ప్రజలకు ఇబ్బందుల్లేకుండా చూస్తాం / 4 రోజుల్లో పరికరాలన్నీ సిద్ధం చేస్తాం: ఎమ్మెల్యే

విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగిన ఐరాల తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో పరిశీలన

ఐరాల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఐరాల తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రజలకు ఏ ఇబ్బందులు లేకుండా చూస్తామని ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. సోమవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగిన కార్యాలయాలను మంగళవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. ఓ తొండ ప్రమాదవశాత్తూ 11 కేవీ విద్యుత్ తీగలపై పడటంతో రెండు ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రమాదం జరిగడం విచారకరమన్నారు. రెండు కార్యాలయాల్లోను పలు పరికరాలు కాలిపోయాయని చెప్పారు. నాలుగు రోజుల్లో కార్యాలయాలకు అవసరమైన పరికరాలను తెప్పిస్తానని వివరించారు. రికార్డులకు, సిబ్బందికి ఏమీ కాలేదన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు గిరిధర్‌బాబు, నాయకులు గంగారాపు హరిబాబునాయుడు, రంజిత్‌రెడ్డి, రాజేష్‌రెడ్డి, లోకనాథరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎంపీడీవో కార్యాలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీమోహన్

ముస్తాబవుతున్న సుబ్రహ్మణ్యేశ్వరుడి ఆలయం



గుడిపాల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కుప్పిగానిపల్లె గ్రామ సమీపంలోని కందగిరి కొండపై ఉన్న వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం ద్వితీయ కుంబాభిషేకానికి ముస్తాబవుతోంది. ఆలయ చైర్మన్ సుబ్రహ్మణ్యం నాయుడు మంగళవారం మీడియాకు వివరాలు తెలిపారు. ఈనెల 15 నుంచి 17వ తేదీవరకు కుంభాభిషేకం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 15న విఘ్నేశ్వర పూజ, 16న మూలస్థాన స్వామివారికి మహాకుంభాభిషేకం, మధ్యాహ్నం అన్నదానం, 17న మండలాభిషేకం జరుగుతుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై, స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

వైభవంగా గిరిప్రదక్షిణ

పెనుమూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): పులిగుండు శివాలయంలో వెలసిన పార్వతీపరమేశ్వరుల ఆలయంలో పౌర్ణమి వేడుకలు మంగళవారం జరిగాయి. స్వామివారికి రకరకాల పుష్పాలంకరణ, అభిషేకాలు జరిగాయి. సాయంత్రం స్వామివారిని శేష వాహనంపై అలంకరించి.. కొత్తరోడ్డు, రాణావేణు గోపాలపురం, సీఎస్ అగ్రహారం మీదుగా గిరిప్రదక్షిణ వైభవంగా నిర్వహించారు. వందలాది భక్తులు పాల్గొన్నారు. మధ్యాహ్నం, రాత్రి భక్తులకు అన్నదానం చేశారు. నిర్వాహకులు షణ్ముగరెడ్డి, గోవిందరెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



శేషవాహనంపై పార్వతీపరమేశ్వరుడు

బంగారమ్మకు ప్రత్యేక పూజలు

వెదురుకుప్పం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని గ్రామ దేవత బంగారమ్మకు మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు పొంగళ్లు పెట్టి, నైవేద్యం సమర్పించారు. వివిధ గ్రామాల భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.



మద్యం దుకాణాల తనిఖీ



స్టాక్ వివరాలు పరిశీలిస్తున్న సుబ్రహ్మణ్యం

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణాలను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈఎస్ సుబ్రహ్మణ్యం తనిఖీ చేశారు. మంగళవారం చిత్తూరు, గంగాధరనెల్లూరు పరిధిలోని దుకాణాల్లో స్టాక్ రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వం నిర్ణయించిన ఎంఆర్‌పీకే విక్రయించాలని, నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మహిళపై అత్యాచారయత్నం

బైరెడ్డిపల్లె, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లె పట్టణంలోని ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన ఓ మహిళపై మంగళవారం మధ్యాహ్నం అదే ప్రాంతానికి చెందిన నాగరాజు అత్యాచారానికి యత్నించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు బైరెడ్డిపల్లె ఎస్‌ఐ పరశురాముడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ తనిఖీలు



విద్యార్థినులతో మాట్లాడుతున్న సాంబశివారెడ్డి

పెనుమూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హైస్కూల్, అంగన్వాడీ కేంద్రం, సీహెచ్‌సీ, బాలికల హాస్టల్‌ను మంగళవారం చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ సాంబశివారెడ్డి తనిఖీ చేశారు. అనంతరం సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. మండలం పలు సర్వేల్లో వెనుకబడి ఉందని, అలాగే ఫిర్యాదులు ఎక్కువగా వస్తుండటంతో మండల ప్రత్యేక అధికారిగా చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ సాంబశివారెడ్డిని కలెక్టర్ నియమించారు. ఇందులో భాగంగా ఆయన మండలంలో విస్తృతంగా పర్యటించారు. పెనుమూరు హైస్కూల్, ఏనుగుకొండయ్యపల్లె అంగన్వాడీ కేంద్రాల్లో రిజిస్టర్లు, మధ్యాహ్న భోజనం పరిశీలించారు. సాయంత్రం నాలుగు గంటలకు సీహెచ్‌సీలో ఒక్క డాక్టరే అందుబాటులో ఉండటాన్ని గమనించారు. స్టాక్ రిజిస్టర్ అందుబాటులో లేదని గుర్తించారు. సాయంత్రం బాలికల హాస్టల్‌ను తనిఖీ చేసి.. విద్యార్థినులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నీలకంఠేశ్వర్‌రెడ్డి, సెక్రటరీ ప్రభుకిరణ్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

వేలం వాయిదా: కమిషనర్

నగరి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): నగరి మున్సిపాలిటీలోని వారపు సంత, దినసరి మార్కెట్, బస్టాండు, ట్యాక్సీ టోలు, జంతువధశాలకు గుత్త వసూలు చేసుకునే హక్కుల కోసం బుధవారం నిర్వహించాల్సిన వేలంను వాయిదా వేస్తున్నట్లు కమిషనర్ కృష్ణారెడ్డి తెలిపారు. ఈనెల 20వ తేదీన వేలం జరుగుతుందని పేర్కొన్నారు. 19వ తేదీన ఉదయం 10నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు దరావత్తు చెల్లించి, రసీదు పొందాలని సూచించారు.

కలిమిచేనులో 'పొలం పిలుస్తోంది'

వెదురుకుప్పం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కలిమిచేను గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని వ్యవసాయాధికారి సి.వనిత చేపట్టారు. ఈ సందర్భంగా రైతులకు పంట సాగు యాజమాన్య పద్ధతులను గురించి వివరించారు. ప్రభుత్వం ఇచ్చే రాయితీలపై అవగాహన కల్పించారు.

రైతుల వివరాలు నమోదు చేసుకోవాలి

వెదురుకుప్పం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రైతులంతా తమ భూముల వివరాలను రైతు సేవా కేంద్రాల్లోకి వచ్చి ఫార్మర్ రిజిస్ట్రీ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి సి.వనిత మంగళవారం తెలిపారు. తమ వద్దకు వచ్చిన వారికి పోర్టల్‌లో నమోదు చేసి.. విశిష్ట సంఖ్యను అందించడం జరిగిందని చెప్పారు.

విద్యార్థులకు కంటి అద్దాల పంపిణీ

యాదమరి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): యాదమరి ఉన్నత పాఠశాల విద్యార్థులకు జిల్లా అంధత్వ నివారణ బృందం ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మంగళవారం కంటి అద్దాలను ఎంపీడీవో వేణు పంపిణీ చేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ అనిల్‌కుమార్ నాయక్, సీహెచ్‌వో లక్ష్మీనారాయణ, ఎంఈవోలు రుక్మిణి, ప్రసాద్, హెచ్‌ఎం గిరిరాజా, టీచర్లు పాల్గొన్నారు.

దీన దయాళ్‌కు నివాళి



వెదురుకుప్పం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): పండిట్ దీన దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతి సందర్భంగా ఎస్సీ మోర్చా జిల్లా ప్రధానకార్యదర్శి పాముల శేషాద్రి కుమార్ మంగళవారం నివాళి అర్పించారు. బొమ్మయ్యపల్లె గ్రామ పంచాయతీ తెల్లగుండ్లపల్లెలో దీన్ దయాళ్ చిత్ర పటానికి పుష్పాంజలి ఘటించారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే కాన్పులు చేయించుకోండి

పాలసముద్రం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే కాన్పులు చేయించుకోండని డాక్టర్ కృష్ణమోహన్ సూచించారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో 38 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో 11 మందికి హైరిస్క్ ఉన్నట్లు గుర్తించారు. సూపర్‌వైజర్ మురళి, ఏఎన్‌ఎంలు లక్ష్మి, అరుణ, కమల, రేవతి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

బెల్టు షాపు నిర్వాహకుడి అరెస్టు

వెదురుకుప్పం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలంలో బెల్టు షాపుపై మంగళవారం సాయంత్రం దాడి చేసి, నిర్వాహకుడిని అరెస్టు చేశారు. 24 క్వార్టర్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. కార్వేటినగరం ఎస్‌ఐ రాజ్‌కుమార్ మీడియాకు వివరాలు తెలిపారు. కనకమ్మకండ్రిగలో బెల్టుషాపు నిర్వహణపై పోలీసులకు సమాచారం అందడంతో దాడి చేసి, నిర్వాహకుడు గోపిని అరెస్టు చేశారు. 24 క్వార్టర్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ట్రాఫిక్ కష్టాలు తొలగేదెన్నడో..?

నగరి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఏకాంబరకుప్పం రైల్వేగేటు వద్ద సాయంత్రం ఐదు గంటలైతే చాలు వాహనాల రద్దీతో జనానికి తిప్పలు తప్పడం లేదు. గేటు వేయడంతో ఒక్కోసారి సుమారు ఇటు, అటు అరకిలోమీటరు మేర వాహనాలు స్తంభిస్తాయి. ఆ సమయంలో వాహనాల్లో ఏకాంబరకుప్పం నుంచి నగరికి రావాలన్నా, నగరి నుంచి ఏకాంబరకుప్పం వైపు వెళ్లాలన్నా ఇక్కట్లు అన్నీ ఇన్నీ కావు. ఈ కష్టాలు ఎప్పటికి తొలగుతాయోనని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



సాయంత్రం సమయంలో రైల్వేగేటు వద్ద స్తంభించిన ట్రాఫిక్

కుప్పం అర్బన్‌కు ఇద్దరు ఎస్‌ఐలు

కుప్పం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కుప్పం అర్బన్ సర్కిల్‌కు ఇద్దరు ఎస్‌ఐలను నియమిస్తూ ఎస్పీ మణికంఠ ఉత్తర్వులు జారీ చేశారు. వి.కోట నుంచి ఇ.బాబు, చిత్తూరు నుంచి వై.రామకృష్ణలను కుప్పం అర్బన్ సర్కిల్‌లో నియమించారు. కుప్పం అర్బన్ సర్కిల్‌లో ఎస్‌ఐల పోస్టులు ఖాళీగా ఉన్న అంశంపై ఈనెల 6వ తేదీన 'ఎస్‌ఐలు కావలెను' అన్న శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. కుప్పం మున్సిపాలిటీతోపాటు మొత్తం మండలం అర్బన్ సర్కిల్ పరిధిలోకి వస్తుంది. ఇక్కడ ట్రాఫిక్ సమస్యతో పాటు గంజాయి, సారా వంటి సమస్యలు ఉన్నాయి. ప్రొటోకాల్ డ్యూటీ అదనం. ఎస్‌ఐలు లేకపోవడంతో ఉన్న ఒకేఒక సీఐ పి.శంకరయ్య మాత్రమే అంతంతమాత్రపు సిబ్బందితో నెట్టుకొస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి స్పందించిన జిల్లా ఎస్పీ ఖాళీగా ఉన్న ఎస్‌ఐ పోస్టులను భర్తీ చేస్తూ ఉత్తర్వులు విడుదల చేశారు.



ఎస్‌ఐ బాబు

అనుమానాస్పద స్థితిలో కూలీ మృతి

పలమనేరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): పలమనేరు సమీపంలో జరుగుతున్న ఆరులైన్ల రహదారి పనులు చేసేందుకు ఉత్తరప్రదేశ్ నుంచి వచ్చిన హరీష్ చందర్‌పాండే (55) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఆరులైన్ల రహదారిలో పలమనేరు మున్సిపాలిటీ పరిధిలోని గొబ్బిళ్లకోటూరు నుంచి అపస్మారక స్థితికి చేరుకున్న హరీష్‌చందర్‌పాండేను కూలీలు పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తీసుకొచ్చారు. అయితే అప్పటికే అతడు మృతిచెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. మృతిపై అనుమానాలు వ్యక్తం చేయడంతో పలమనేరు పోలీసులు కేసు విచారిస్తున్నారు.



మృతి చెందిన హరీష్‌చందర్ పాండే